# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 62 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | బుధవారం 23 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 62 23-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## రాజ్ కసిరెడ్డి విచారణ పూర్తి..

### కీలక ఆధారాలు సేకరించిన అధికారులు

విజయవాడ ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణంలో నాటి ప్రభుత్వ పెద్దల తరపున అన్నీ తానై వ్యవహరించిన రాజ్ కసిరెడ్డి విచారణ పూర్తయింది. అనంతరం అతడిని పోలీసులు సిట్ కార్యాలయం నుంచి విజయవాడ కొత్త ప్రభుత్వ



- తరువాయి 2లో..

## ఢిల్లీ పర్యటనలో చంద్రబాబు

# బిజీ.. బిజీ

### కేంద్ర మంత్రులతో సీఎం చంద్రబాబు వరుస భేటీలు

### పోలవరంను సందర్శించండి - కేంద్ర మంత్రి పాటిల్ కు చంద్రబాబు ఆహ్వానం





అమరావతి ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం నాడు ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలుస్తూ బిజీ బిజీగా ఉన్నారు. కేంద్ర మంత్రులతో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయన చర్చలు జరుపుతున్నారు. మంగళవారం ఉదయం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సీఎం చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అభివృద్ధి అంశాలపై చర్చలు జరిపారు. అమరావతి నిర్మాణ పనుల పునః ప్రారంభం కోసం మే 2న ప్రధాని మోదీ ఏపి పర్యటన ఏర్పాట్లపై కూడా వారిద్దరూ చర్చించారు. ఏపిలో ఖాళీ అయిన రాజ్యసభ స్థానం భర్తీపై కూడా చంద్రబాబు, షా మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈ స్థానం బీజేపీకి వదిలి పెట్టాలని అమిత్ షా కోరగా పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు తెలిపినట్లు సమాచారం. అంతకు ముందు కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. పోలవరం ప్రాజెక్టు, నిధులు ఇతర అంశాలపై సుదీర్ఘంగా ఆయనతో చర్చించారు. సిఆర్ పాటిల్‌తో భేటీ అనంతరం కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మెగావాల్‌తో సీఎం చంద్రబాబు నాయుడు

- తరువాయి 2లో..






## సివిల్స్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సివిల్స్-2024 ఫలితాలు విడుదలయ్యాయి. తుది ఫలితాలను యూపీఎస్సీ కాసేపటి క్రితం ప్రకటించింది. మొతం 1009 అభ్యర్థులు సివిల్స్ లో ర్యాంకులు సాధించారు.. ఇందులో ఐఎఎస్ కు 180 మంది, ఐఎఫ్ఎస్ కు 55, ఐపిఎస్ కు 147 మంది ఎంపికయ్యారు., తాజాగా వెలువడిన ఫలితాల్లో శక్తి దూబేకు మొదటి ర్యాంకు లభించగా.. తెలుగు రాష్ట్రాలకు చెందిన సాయి శివాని 11వ ర్యాంకు, బన్నా వెంకటేశ్ 15వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా శ్రవణ్ కుమార్ రెడ్డి 62, సాయి చైతన్య జాదవ్ కు 68 ర్యాంక్ సాధించారు. 2024 జూన్‌లో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షకు సుమారు 5 లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరు కాగా.. మెయిన్స్‌లో 2,845 మంది ఉత్తీర్ణులై.. ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. ఇక తెలుగు రాష్ట్రాల నుంచి ప్రిలిమినరీ పరీక్షకు 42,560 మంది హాజరు కాగా.. అందులో సుమారు 500మంది మెయిన్స్‌కు, 100 మందికి పైగా ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. ఈ ఫలితాల్లో 1,009 మందిని యూపీఎస్సీ ఎంపిక చేయగా, ఇందులో జనరల్ కేటగిరీలో 335 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి 109, ఓబీసీ నుంచి 318, ఎస్సీ కేటగిరీలో 160, ఎస్టీ కేటగిరీలో 87 మంది చొప్పున ఎంపికయ్యారు.

**టాప్ టెన్ ర్యాంకర్స్ వీరే..**

యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో శక్తి దూబే మొదటి

- తరువాయి 2లో..

## ఐపిఎస్ అధికారి అరెస్ట్

# కక్ష సాధింపు చర్యే..

### రాష్ట్రం ఎటు పోతుందో అర్థం కావడం లేదు -వైసీపీ అధినేత జగన్ ఆందోళన



గుంటూరు, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గుంటూరు, రాష్ట్రంలో కూటమి పాలనలో వ్యవస్థలన్నీ దిగజారుస్తున్నారని.. దుష్ట సంప్రదాయాలకు తెర లేపుతున్నారని, రాష్ట్రం ఎటు పోతుందో అర్థం కావడం లేదని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ పీఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి

- తరువాయి 2లో..

## ఏపీ లిక్కర్ దొంగల బట్టలు విప్పేందుకు పూర్తిగా

# సహకరిస్తా..

## విజయసాయి ట్వీట్

విజయవాడ, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఆంధ్రప్రదేశ్‌లో లిక్క్ స్కామ్ సంచలనంగా మారింది.. ఇప్పటికే సిట్ విచారణ ఎదుర్కొన్న మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి.. కీలక సమాచారాన్ని సిట్ అధికారులకు చెప్పారు.. ఇక, రంగంలోకి దిగిన సిట్ ఈ కేసులో కీలకంగా భావిస్తోన్న రాజ్ కసిరెడ్డిని అరెస్ట్ చేసింది.. ప్రస్తుతం కసిరెడ్డిని విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారిస్తున్నారు.. నేడు కసిరెడ్డిని అధికారులు కోర్టులో కూడా

- తరువాయి 2లో..

## పార్లమెంటే

# అత్యున్నతమైది

### ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్




న్యూఢిల్లీ ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పార్లమెంటును మించినది ఏదీ లేదని.. పార్లమెంటే అత్యున్నతమైనదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ అన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు రాష్ట్రాల గవర్నర్లు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను తొక్కిపెట్టడంపైన ఆగ్రహం వ్యక్తం చేసింది. గవర్నర్లు గానీ, రాష్ట్రపతి గానీ శాసనసభ ఆమోదించిన బిల్లులను నిర్దేశ గడువులోపే పరిశీలించి ఆమోదించాలని

- తరువాయి 2లో..

## 89 వేల మందికి కొత్తగా..

# స్పౌజ్ పింఛన్లు!





అమరావతి, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కుటుంబంలో పింఛను తీసుకుంటున్న భర్త మరణిస్తే ఆయన భార్యకు జాప్యం లేకుండా పింఛను (స్పౌజ్ పింఛను) అందించేందుకు ఏపీ ప్రభుత్వం సన్నద్ధమైంది. 2023 డిసెంబరు 1 నుంచి స్పౌజ్ కేటగిరీ పింఛను మంజూరు చేయాలని నిర్ణయించింది. మేలో దరఖాస్తులు తీసుకుని జూన్ 1 నుంచి పింఛను అందించనున్నారు. ఈ కేటగిరీలో 89,778 అర్హులుంటారని భావిస్తున్నారు. లి జులైలో కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే దీనిపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ నిర్వహించింది. ఈ వారంలో మరోసారి సమావేశమై కొత్త పింఛన్ల మంజూరుపై ప్రభుత్వానికి నివేదించనుంది. ఆ తర్వాత ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. కొత్తగా వివిధ

- తరువాయి 2లో..

## 1.20 కోట్ల ఉపాధి కూలీలకు ప్రమాదబీమా..

### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్ణయం

**ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా ప్రభుత్వమే ప్రీమియం చెల్లింపు.**

**కూలీల వివరాలతో ఫీల్డ్ అసిస్టెంట్లు బ్యాంకులో నమోదు చేయించాలి.**

అమరావతి, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్రం లోని ఉపాధి కూలీలందరికీ ప్రమాదబీమా చేయించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయించింది. ఇటీవల మొగల్తూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధి కూలీలు చనిపోయినప్పుడు వారికి బీమా లేకపోవడంతో ఆ కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక సాయం అందని పరిస్థితి ఏర్పడింది. అలాంటి కుటుంబాలకు ఆసరాగా నిలిచేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో పనిచేసే 1.20 కోట్ల మంది ఉపాధి కూలీలను ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, రాష్ట్రీయ స్వస్థ బీమా యోజన కిందకు తీసుకురావాలని నిర్ణయించారు. ఆ మేరకు పంచా యతీరాజ్,

- తరువాయి 2లో..



తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## ఇండియా విధానం సరైనదేనా?

భారత ప్రభుత్వం సుంకాల విషయమై అమెరికాతో చర్చిస్తున్న పద్ధతిని కొందరు సమర్థిస్తుండగా, కొందరు విమర్శిస్తున్నారు. విలువైన అంశాలు రెండింటిలోనూ ఉన్నాయి. కానీ ఈ చర్చలన్నీ తక్షణ అంశాల చుట్టూ తిరుగుతున్నాయి. అవి అవసరమే. అదే సమయంలో మరికొంత లోతుకు వెళ్లటం, దీర్ఘకాలిక దృష్టి తీసుకోవటం కూడా చేస్తే తప్ప ఇంత ముఖ్యమైన విషయమై సమగ్రమైన అవగాహన ఏర్పడదు.

ఇతర దేశాల నుంచి దిగుమతులపై తాము స్వల్పమైన సుంకాలు విధిస్తున్నామనీ, తమ ఎగుమతులపై మాత్రం వారు భారీ సుంకాలు వేస్తున్నారనీ, ఆ విధంగా తాము రెండు విధాలుగానూ నష్టపోతున్నామన్నది అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటున్నమాట. కేవలం గణాంకాలకు పరిమితమైతే అది నిజమే. కానీ, అందులో అనేక మతలబులున్నాయి.

అమెరికాలో ఒకప్పుడు విస్తారంగా ఉండిన ఉత్పత్తుల రంగాన్ని కుదించి, పరిశ్రమలను ఇతర దేశాలకు తరలించింది అక్కడి ప్రభుత్వమే గదా? అసలు వివిధ అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య సంస్థలను ఉనికిలోకి తెచ్చి స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రోత్సహించిందే అమెరికా. ఒకవేళ 90 రోజుల వాయిదా కాలంలో చర్చల ద్వారా కొన్ని సర్దుబాట్లు జరిగినా కొంత నష్టం మిగిలే ఉంటుంది.

ఈ పరిణామాలన్నింటి ప్రభావంతో అమెరికా పట్ల ప్రపంచానికి ఇంత కాలం ఉండిన విశ్వాసం తగ్గుతుందనే సందేహం ఉంది. అది జరిగినపుడు ఇప్పటికే గల బహుళ ధ్రువ ప్రపంచ ధోరణులు మరింత బలపడగలవనే అభిప్రాయాలు ఎక్కువవుతున్నాయి.

### నాలుగు ధోరణులు

ఇండియాతో అమెరికా వాణిజ్య లోటు 2024%-%25లో 41.18 బిలి యన్ డాలర్లు. మన దిగుమతులపై అమెరికా సుంకాల రేటు సగటున 2.7 శాతం. అమెరికా నుంచి దిగుమతులపై మన సుంకాల రేటు సగ టున 12 శాతం కాగా, కొన్ని సరుకులపై 48 శాతం వరకు ఉంది. ఈ లెక్కలను బట్టి అమెరికా అధ్యక్షుడు అన్ని దేశాలతో గల వాణిజ్య లోటులో 50 శాతం మేర సుంకాలు పెంచిన ప్రకారం భారత ఎగుమతులపై రేటును 26 శాతంగా ప్రకటించారు. ఏప్రిల్ 2న ఈ కొత్త రేట్లు ప్రకటించటానికి ముందే చేసిన హెచ్చరికలను బట్టి భారత ప్రభుత్వం అమెరికన్ మోటార్ సైకిళ్లు వగైరాపై సుంకాలు తగ్గించటం తెలిసిందే. అయినప్పటికీ కొత్త రేట్లు యథావిధిగా పెరిగాయి.

ఈ పరిస్థితుల దృష్ట్యా భారత్ ఏమి చేయాలన్నది ప్రశ్న. ప్రపంచ దేశాలు చేస్తున్నదేమిటని చూడగా నాలుగు ధోరణులు కనిపిస్తు న్నాయి. కొన్ని చిన్న ఆర్థిక వ్యవస్థలు పూర్తిగా లొంగి పోతున్నాయి. అమెరికా నుంచి దిగుమతులపై సుంకాలు నూరు శాతం రద్దు చేస్తు న్నాయి. ఇందుకు ఒక ఉదాహరణ జింబాబ్వే.

కొన్ని సామరస్య ధోర ణితో ఇచ్చిపుచ్చుకునే మార్గాన్ని అనుసరిస్తున్నాయి. జపాన్ అందు కొక ఉదాహరణ. కొన్ని ఎదురు సుంకాలతో ప్రతిఘటిస్తూ అమెరికా తగ్గితే తాము తగ్గుతామంటున్నాయి. కెనడా, యూరోపియన్ దేశాలు ఈ కోవలోకి వస్తాయి. చైనా ఒక్కటి భిన్నంగా కనిపిస్తున్నది. పోరాడు తాము తప్ప లొంగే ప్రసక్తి లేదని స్పష్టం చేస్తున్నది.

ఈ నాలుగింటిలో ఇండియా ప్రయోజనాలకు ఉపయోగపడ గలది ఏది? చైనా వలె పూర్తిగా ధిక్కరించటమన్నది అభిలషణీయం కాదు, కావాలనుకున్నా సాధ్యమయ్యేదీ కాదు. వారిది రెండవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ. భారత దేశం కన్నా అయిదు రెట్లు పెద్దది.

క్రమంగా అమెరికాను మించిపోయి అగ్రస్థానానికి చేరాలన్నది చైనా లక్ష్యం. మన స్థితిగతులుగానీ, లక్ష్యాలుగానీ వీలైనంత అభివృద్ధి చెందటమే తప్ప చైనా వంటివి కావు. కనుక ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు అటువంటి వైఖరి తీసుకోవటమన్న ఆలోచనే అసందర్భం. ఇదంతా అర్థమయ్యో, కాకనో కొందరు భారత ప్రభుత్వాన్ని ఆక్షేపిస్తున్నారు.

### జపాన్ మార్గం

ఇక మిగిలినవి జపాన్, కెనడా ప్లస్ యూరోపియన్ మార్గాలు. ఈ రెండింటిలో రెండవది కూడా ఇండియాకు అనుకూలించగలది కాదు. అందుకు ఒక కారణం యూరోపియన్ దేశాలన్నీ ఒక బృందం వలె నిలిచి ఉన్నాయి. అది గాక సైనికంగా, భౌగోళిక వ్యూహాల రీత్యా అమెరికా, కెనడా, యూరప్‌ల సాన్నిహిత్యం భిన్నమైనది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నందువల్లనే అమెరికా ట్యారిఫ్‌లను వారు బలంగా ఎదుర్కొంటూ, ఆ దేశం దిగి రావలసిందేనని స్పష్టం చేస్తు న్నారు. ఇదంతా భారతదేశానికి సాధ్యమయ్యేది కాదు.

అందువల్ల స్థూలంగా జపాన్ నమూనా ఒక్కటే మిగులుతున్నది. దక్షిణ కొరియా, మెక్సికో మొదలైన వాటి వైఖరి కూడా ఇంచుమించు ఇదే విధంగా కనిపిస్తున్నది. ఈ పద్ధతి ఇంకా ఇదమిత్థంగా రూపు తీసుకోలేదు. చర్చలు జరిగే కొద్దీ ఇందుకొక రూపం రాగలదని భావించవచ్చు.

భారత్ స్థూలంగా జపాన్ తరహా వైఖరిని తీసుకుంటున్నట్లు కని పిస్తున్నది. ఇందులోనూ ఒక ఆకు తక్కువే. అమెరికాతో జపాన్‌కు గల వ్యూహాత్మక భాగస్వామ్యం వేరు. అందుకే 'స్థూలంగా' అనే మాటను ఉపయోగించటం. ఇవన్నీ చెప్పుకున్న తర్వాత, భారతదేశం గురించి మాట్లాడుకోవలసిన మౌలికమైన విషయాలు రెండున్నాయి. భారత అభివృద్ధి స్థితిగతులు ఏ విధంగా ఉన్నాయి? కొత్త అభివృద్ధి లక్ష్యాల సాధనకు అనుసరించవలసిన మార్గం ఏమిటని ప్రభుత్వం భావిస్తున్నది? సుంకాల యుద్ధంపై తీసుకోగల వైఖరికి ఈ ప్రశ్నలతో సంబంధం ఉంటుంది.

### దేశ ప్రయోజనాలే ముఖ్యం!

ఆర్థికాభివృద్ధి రీత్యా ఇండియా ఇంకా వర్ధమాన దేశమే. అభివృద్ధి చెందుతున్నా, ఆ వేగం ఉండవలసినంతగా లేదు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే అంతర్గతంగా జరగవలసింది చాలా ఉండటంతో పాటు, అభివృద్ధి చెందిన దేశాల నుంచి, ఇంచు మించు తన స్థాయిలో గల వర్ధమాన దేశాల నుంచి, అవసరమైన వనరులు గల దేశాల నుంచి సహకారం అవసరం. అందుకోసం ఈ కూటమి, ఆ కూటమి అనే ఒకప్పటి రాజకీయాలతో సంబంధం లేకుండా అన్ని వైపుల నుంచి సహకారం కోసం సమ సంబంధాలు పాటించాలి. దేశ ప్రయోజనాలే దేనికైనా గీటురాయి కావాలి. శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులంటూ ఉండరు.

పరిస్థితులు, ఫిలాసఫీ రెండూ ఇవే. ఇదంతా ఇప్పుడు మనం సుంకాల సమస్యల సందర్భంలో కొత్తగా సూత్రీకరిస్తున్నది కాదు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ 'ది ఇండియా వే, స్ట్రాటజీస్ ఫర్ యాన్ అన్‌సర్టెన్ వరల్డ్' (2020) పేరిట రాసిన పుస్తకంలో ఈ సూత్రీ కరణలన్నీ కనిపిస్తాయి. శీర్షిక దానికదే ఎంతో అర్థవంతమైనది. 'మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా జీవించటమే వివేకం' అనే తిరు వళ్ళువర్ బోధనతో ఆయన తన పుస్తకాన్ని ప్రారంభించారు.

బ్రిటిష్ పాలకులు వచ్చిపడుతుండగా చదరంగంలో మునిగి రాజ్యం పోగొట్టుకున్న బెంగాల్ నవాబుల ఉదంతంతో 'షతరంజ్ కే ఖిలాడీ' సినిమా తీసిన సత్యజిత్ రే హెచ్చరిక, అమెరికా బలహీనపడుతుండగా ముందుకు దూసుకుపోతున్న చైనాల గురించి చర్చిస్తూ, 'ఇప్పుడు భారతదేశం తనను తాను నిర్వచించుకుంటుందా? లేక ఇంకో ప్రపంచమే నిర్వచిస్తుంటుందా?' అని ప్రశ్నిస్తారు. స్వయంగా అమెరికా, చైనాలలో రాయబారిగా పనిచేసిన జైశంకర్ సూత్రీకర ణలు, రూపొందిస్తున్న విదేశాంగ విధానాలు ప్రస్తుత క్లిష్ట పరిణా మాలకు తగినవే.

# శనివారం.. పోప్ అంత్యక్రియలు

**వాటికన్ సిటీ :** కేథలిక్‌ల మతగురువు పోప్ ఫ్రాన్సిస్ సోమవారం కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు శనివారం ఉదయం (ఏప్రిల్ 26) 10 గంటలకు సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో నిర్వహించనున్నట్లు వాటికన్ వర్గాలు మంగళవారం తెలిపాయి. ప్రజల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని బుధవారం సెయింట్ పీటర్స్ బసిలికాలో ఉంచనున్నట్లు వాటికన్ వర్గాలు తెలిపాయి.

కాగా, పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్‌లు హాజరుకానున్నారు. అలాగే అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలే కూడా హాజరుకానున్నారు.



## రాజ్ కసిరెడ్డి విచారణ పూర్తి..

### కీలక ఆధారాలు సేకరించిన అధికారులు

ఆస్పత్రికి తరలించారు. మద్యం స్కామ్‌కు సంబంధించి సుదీర్ఘంగా ప్రశ్నించి, కీలక ఆధారాలు సేకరించారు. ఈ మేరకు రిమాండ్ రిపోర్టును కూడా సిట్ అధికారులు సిద్ధం చేశారు. వైద్య పరీక్షల అనంతరం రాజ్ కసిరెడ్డిని విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

## ఢిల్లీ పర్యటనలో చంద్రబాబు బీజీ బీజీ



సమావేశమయ్యారు. ఈ భేటీలో బాబుతో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎంపీలు గంటి హరీష్ బాలయోగి, సానా సతీష్ బాబు, తెన్నేటి కృష్ణ ప్రసాద్, రాజ్యసభ మాజీ సభ్యులు కంభంపాటి రామ్మోహనరావు, కనకమేడల రవీంద్ర కుమార్ పాల్గొన్నారు. తర్వాత కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో చంద్రబాబు భేటి అయ్యారు. ఏపీ రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చలు జరిపారు. దాదాపు గంట పాటు పీయూష్ గోయల్‌తో చంద్రబాబు చర్చలు జరిపారు.

**చంద్రబాబుకు ఘన స్వాగతం**

ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశీ పర్యటన ముగించుకుని ఢిల్లీ చేరుకున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఢిల్లీ విమానాశ్రయంలో దిగారు. అక్కడి నుంచి తన అధికారిక నివాసం 1 జన్‌పథ్‌కు చేరుకుని, రాత్రి అక్కడే బస చేశారు. మంగళవారం ఆయన పలువురు కేంద్ర మంత్రులను కలుస్తూ బిజీ బిజీగా ఉన్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు ఘనస్వాగతం లభించింది. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, టీడీపీ పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వారికి స్వాగతం పలికారు. అప్పలనాయుడు, ఆయన సతీమణి ప్రభా నాయుడు అరసవెల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం తీర్థప్రసాదాలు అందజేశారు.

**పోలవరంను సందర్శించండి %-% కేంద్ర మంత్రి పాటిల్ కు చంద్రబాబు ఆహ్వానం**

కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఢిల్లీలోని ఆయన మంత్రిత్వ కార్యాలయంలో భేటి అయ్యారు.. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు.. ఈ సమావేశంలో కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్ర శేఖర్, టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కృష్ణ ప్రసాద్, అప్పలనాయుడు, హరీష్ బాలయోగి, సానా సతీష్ తదితరలు పాల్గొన్నారు.. అయితే, పోలవరం ప్రాజెక్ట్ కు నిధులుతో పాటు, బనకచర్ల ప్రాజెక్ట్ కు అనుమతులుపై ఈ సమావేశంలో చర్చించారు.. బనకచర్ల ప్రాజెక్ట్ ద్వారా నీటి ఎద్దడిని ఎదుర్కునే రాయలసీమ ప్రాంతానికి జలాలు అందించాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ఉంది.. గోదావరి, పెన్నా నదులను అనుసంధానం చేస్తూ బనకచర్ల ప్రాజెక్టును నిర్మించాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.. గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమకు తరలించాలని ఏపీ ప్రభుత్వం ఆలోచనగా ఉంది.. అయితే, దీనిపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న వేళ.. బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు, ఆర్థిక సహకారాన్ని కోరుతున్నారు చంద్రబాబు నాయుడు.. దానిలో భాగంగా ఈ రోజు కేంద్ర జలశక్తి మంత్రిని కలిశారు.. మరోవైపు.. పోలవరం ప్రాజెక్ట్ పురోగతి, 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు తొలి దశ పూర్తయ్యేలా సహకారం అందించాలని కూడా కేంద్రమంత్రిని కోరారు చంద్రబాబు.. ఇక, పోలవరం ప్రాజెక్ట్ ను సందర్శించాలని కేంద్రమంత్రిని ఆహ్వానించారు చంద్రబాబు నాయుడు.

## సివిల్స్ ఫలితాలు విడుదల

ర్యాంక్ సాధించారు. హర్షకి గోయ్ రెండో ర్యాంక్ సాధించారు. డోంగ్రే అర్చిత్ పరాగ్ 3వ ర్యాంక్, షా మార్గి చిరాగ్ 4, ఆకాష్ గార్గ్ 5, కోమల్ పూనియా 6, ఆయుషి బన్సల్ 7, రాజ్ కృష్ణ ఝా 8, ఆదిత్య విక్రమ్ అగర్వాల్ 9, మయాంక్ త్రిపాఠి 10వ ర్యాంకు సాధించారు.

**సివిల్స్ లో తెలుగు రాష్ట్రాల అభ్యర్థుల జోరు..**

వెలగపూడి హైదరాబాద్ %-% నేడు ప్రకటించిన సివిల్స్ ఫలితాలలో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు మంచి ఫలితాలను సాధించారు..రెండు వందల లోపు ర్యాంకులలో మొత్తం 12 మంది చోటు దక్కించుకున్నారు.. ఈ ఫలితాలలో ఈ సాయి శివానీకి 11, బన్నా వెంకటేష్ కు 15, అభిషేక్ శర్మకు 38, రావుల జయ సింహారెడ్డి 46, శ్రవణ్ కుమార్ రెడ్డి కి 68వ ర్యాంక్ లు లభించాయి.. అలాగే విజయం సాధించిన 1009 మంది అభ్యర్థులలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 40 మందికి పైగా వారున్నారని సమాచారం

**సివిల్స్ లో మెరిసిన తెలుగు వారు వీరేశా**

ఇ.సాయి శివాని 11వ ర్యాంకు, బన్నా వెంకటేశ్ 15వ ర్యాంకు, అభిషేక్ శర్మ 38వ ర్యాంకు, రావుల జయసింహారెడ్డి 46 వర్యాంకు, శ్రవణ్ కుమార్ రెడ్డి 62వ ర్యాంకు
సాయి చైతన్య జాదవ్ 68 వర్యాంకు, ఎన్ చేతనరెడ్డి 110వ ర్యాంకు, చెన్నంరెడ్డి శివగణేష్ రెడ్డి 119వ ర్యాంకు, చల్లా పవన్ కల్యాణ్ 146వ ర్యాంకు, ఎన్. శ్రీకాంత్ రెడ్డి 151వ ర్యాంకు, నెల్లూరు సాయితేజ 154వ ర్యాంకు, కొలిపాక శ్రీకృష్ణసాయి 190వ ర్యాంకు

## ఐపిఎస్ అధికారి అరెస్ట్ కక్ష సాధింపు చర్యే ..

ప్రభుత్వ కక్ష రాజకీయాలు చేస్తున్నదని అన్నారు. ముంబై నటి జత్వానీని వేధించారంటూ సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయుల్ని కూటమి ప్రభుత్వం అరెస్ట్ చేసిన నేపథ్యంలో స్పందించిన జగన్ రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ కక్ష రాజకీయాలపై జగన్ ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు, అన్యాయాలు, అక్రమాలు, అవినీతి ప్రజల్లోకి వెళ్లకుండా డైవర్షన్ చేస్తున్నారని మండిపడ్డారు. సీనియర్ ఐపిఎస్ అధికారి ఆంజనేయులును అరెస్ట్ చేయడం కూటమి కక్ష రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. ఇదే కేసులో మరో ఇద్దరు పోలీస్ అధికారుల పట్ల ప్రభుత్వ తీరును కోర్టు తప్పు పట్టిందని జగన్ గుర్తు చేశారు. "మొదటిసారి ఇలాంటి దుర్మార్గాలు చూస్తున్నా. ఒక వ్యక్తిని ఇరికించడానికి కేసులు క్రియేట్ చేస్తున్నారు. తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారు. రాష్ట్రం ఎటువైపు వెళ్తోందో అర్థం కావడం లేదు" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలోని వ్యవస్థలను దిగజారుస్తున్నారు. దుష్ట సాంప్రదాయాలకు తెర లేపుతున్నారు. ప్రభుత్వం ఇలా పోతే రాష్ట్రంలో అరాచకం తప్ప ఏం మిగలదు. ఎంపీ మిథున్ రెడ్డిని కూడా టార్గెట్ చేశారు. ఎలాగైనా మిథున్ రెడ్డిని ఇరికించాలని చూస్తున్నారు. కాలేజీ రోజుల్లో చంద్రబాబును పెద్దిరెడ్డి ఎదిరించారు. కాబట్టే పెద్దిరెడ్డి కుటుంబంపై బాబు కక్ష పెంచుకున్నారు. లేని ఆరోపణలు, తప్పుడు సాక్ష్యాలు సృష్టించి పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారు" అని జగన్ ఆరోపించారు. "బాబు హయాంలో లిక్కర్ స్కాంపైనా గతంలో సిఐడి కేసు పెట్టింది. లిక్కర్ అమ్మకాలు తగ్గిస్తే లంచాలు ఇస్తారా? అమ్మకాలు పెంచితే లంచాలు ఇస్తారా? ఈ అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. మనం తెచ్చిన లిక్కర్ పాలసీ విప్లవాత్మకమైంది. ప్రైవేట్ దుకాణాలు తీసేసి ప్రభుత్వమే నిర్వహించింది. లిక్కర్ అమ్మకాల సమయాన్ని కూడా తగ్గించాం" అని జగన్ గుర్తు చేశారు. ప్రజా సమస్యలు, అన్యాయాలు, అక్రమాలు, అవినీతి ప్రనజల్లోకి వెళ్లకుండా డైవర్షన్ చేస్తున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి ఆంజనేయులును అరెస్ట్ చేయడం కూటమి కక్ష రాజకీయాలకు పరాకాష్ట అని అన్నారు. ఇదే కేసులో మరో ఇద్దరు పోలీస్ అధికారుల పట? ప్రభుత్వ తీరును కోర్టు తప్పుబట్టిందన్నారు జగన్. మొదటి సారి ఇలాంటి దుర్మార్గాలు చూస్తున్నా. ఒక వ్యక్తిని ఇరికించడానికి కేసులు క్రియేట్ చేస్తున్నారు. తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారు. రాష్ట్రం ఎటువైపు వెళ్తుందో అర్థం కావడం లేదు. రాష్ట్రంలోని వ్యవస్థలను దిగజారస్తున్నారు. దుష్ట సంప్రదాయాలకు తెర లేపుతున్నారు. ప్రభుత్వం ఇలా పోతే రాష్ట్రంలో అరాచకం తప్ప ఏం మిగలదని పేర్కొన్నారు. ఎంపీ మిథున్ రెడ్డిని కూడా టార్గెట్ చేశారని, ఎలాగైనా మిథున్‌రెడ్డిని ఇరికించాలని చూస్తున్నారన్నారు జగన్. కాలేజీ రోజుల్లో చంద్రబాబును పెద్దిరెడ్డి ఎదురించారు. కాబట్టే పెద్దిరెడ్డి కుటుంబంపై చంద్రబాబు కక్ష పెంచుకున్నారు. లేని ఆరోపణలు, తప్పుడు సాక్ష్యాలు సృష్టించి పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారని ఆర్పోంచారు. బాబు హయాంలో లిక్కర్ స్కాంపైనా గతంలో సీఐడీ కేసు పెట్టిందని గుర్తు చేశారు. . మనం తెచ్చిన లిక్కర్ పాలసీ విప్లవాత్మకమైందని, ప్రైవేట్ దుకాణాలు తీసేసి ప్రభుత్వమే నిర్వహించిందని చెప్పారు. లిక్కర్ అమ్మకాలు తగ్గిస్తే లంచాలు ఇస్తారా? అమ్మకాలు పెంచితే లంచాలు ఇస్తారా? ఈ అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి అని పీఏసీ సభ్యులను ఉద్దేశించి జగన్ వ్యాఖ్యానించారు.

## ఏపీ లిక్కర్ దొంగల బట్టలు విప్పేందుకు పూర్తిగా సహకరిస్తా..

హాజరుపరచనున్నారు. కాగా, ఈ లిక్కర్ స్కామ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి.. "ఏపీ లిక్కర్ స్కామ్‌లో నా పాత్ర విజిల్ బ్లోయర్ మాత్రమేనని పేర్కొన్నారు.. తప్పించుకునేందుకే దొరికిన దొంగలు, దొరకని దొంగలు కూడా నా పేరుని లాగుతున్నారని మండిపడ్డ ఆయన.. ఏ రూపాయి నేను ముట్టలేదు.. లిక్కర్ దొంగల బట్టలు సగమే విప్పారు.. వారి మిగతా బట్టలు విప్పేందుకు నేను పూర్తిగా సహకరిస్తాను" అంటూ ట్వీట్ చేశారు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి.. కాగా, సిట్ విచారణ తర్వాత ఈ వ్యవహారంలో కీలక వ్యక్తి రాజ్ కసిరెడ్డే నంటూ వ్యాఖ్యానించారు.. మరోవైపు.. రాజ్ కసిరెడ్డి విడుదల చేసిన ఆడియోలో సాయిరెడ్డిపై మండిపడ్డారు.. లిక్కర్ కేసు వ్యవహారం తేలిన తర్వాత.. విజయసాయిరెడ్డి బాగోతం బయటపెడతానంటూ వ్యాఖ్యానించారు రాజ్ కసిరెడ్డి.. ఈ నేపథ్యంలో.. ట్వీట్‌తో మరింత రచ్చకు తెరలేపారు

## పార్లమెంటే అత్యున్నతమైది

తీర్పునిచ్చింది. గవర్నర్ రాష్ట్రపతికి బిల్లులని పంపినా.. మూడు నెలలోపే ఆ బిల్లులను క్లియర్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తమిళనాడుకు చెందిన బిల్లులపై సుప్రీంకోర్టు చేసిన కీలక వ్యాఖ్యలపై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ స్పందించారు. పార్లమెంటే సుప్రీం అని..రాష్ట్రపతి విధులకు సంబంధించి ఆదేశాలు ఇచ్చే అధికారం న్యాయవ్యవస్థకు లేదని వ్యాఖ్యానించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా విమర్శలపై మరోసారి ఆయన స్పందించారు. తాను అన్న వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నట్లు చెప్పుకొచ్చారు. మంగళవారం ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో జగదీప్ ధన్‌కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పుపై తాను చేసిన వ్యాఖ్యలపై వస్తున్న విమర్శలపై స్పందించారు. రాజ్యాంగ వ్యవస్థ ప్రకారం తాను మాట్లాడిన ప్రతి మాట.. అత్యున్నతమైన జాతి ప్రయోజనాలతో చేసిందే అని అన్నారు. పార్లమెంటే అత్యున్నతమైనది.. న్యాయవస్థ 'సూపర్ పార్లమెంట్' పాత్రను పోషించలేదు, కార్యనిర్వాహక వర్గంలోకి ప్రవేశించలేదు అని అన్నారు.

## 89 వేల మందికి కొత్తగా.. స్పౌజ్ పింఛన్లు!

కేటగిరీల కింద 6 లక్షల వరకు దరఖాస్తులు వస్తాయని గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ అధికారుల ప్రాథమిక అంచనా. ప్రస్తుతం 63.32 లక్షల మందికి పింఛన్ల కోసం రూ.2,722 కోట్లు వెచ్చిస్తున్నారు. కొత్త పింఛన్లకు నెలకు రూ.250 కోట్ల అదనపు భారం పడనుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల నాటికి 2.3 లక్షల దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయి. ఇప్పుడు వారందరి నుంచి మళ్లీ దరఖాస్తులు ఆహ్వానించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది.

## 1.20 కోట్ల ఉపాధి కూలీలకు ప్రమాదబీమా..

గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజకు ఆదేశాలి చ్చారు. మే 1వ తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా కూలీల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని బ్యాంకుల్లో నమోదు చేయించేలా ఫీల్డ్ అసిస్టెంట్లను సన్నద్ధం చేయాలని ఆదేశించారు. దీంతో కమిషనర్ సోమవారం అన్ని జిల్లాల డ్వామా పీడీలతో మాట్లాడారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ప్రీమియం ఒక వ్యక్తికి రూ.20 చెల్లిస్తే చాలు ఆ వ్యక్తి ప్రమాదంలో చనిపోయిన పుడు రూ.2 లక్షల బీమా లభిస్తుంది. అదే విధంగా రాష్ట్రీయ స్వస్థ బీమా యోజన కింద రూ.450 ప్రీమియం చెల్లిస్తే పలు రకాల ప్రమాదాలకు బీమా లభిస్తుంది. ఈ రెండు పథకాల కింద రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి కూలీలను నమోదు చేయాలని కమిషనర్ ఆదేశించారు. మే 1వ తేదీకల్లా రాష్ట్ర వ్యాప్తంగా కూలీల నుంచి సంతకాలు తీసుకుని ఫీల్డ్ అసిస్టెంట్లు బ్యాంకుల వద్ద నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు కసరత్తు చేసి జూన్ లోపు నమోదు ప్రక్రియ పూర్తి చేసి ప్రతి ఉపాధి కుటుంబానికి భరోసా కల్పించాలని నిర్ణయించారు.

# గ్లోబల్ కలలు సరే... మరి లోకలో!

**రాష్ట్రానికి ప్రపంచ విద్యాసంస్థలను తీసు కొస్తామని తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు, విద్యాశాఖా మాత్యులు ఆర్భాటంగా ప్రకటించడం పరిపాటిగా మారి పోయింది. గ్లోబల్ సంస్థలను తీసుకొస్తే కాదనే వారెవరు? మరి ఇప్పటికే ఇక్కడ ఉన్న విశ్వవిద్యాలయాల్లో కనీస సౌకర్యాల కల్పన చేయాలన్న సంగతే మర్చిపోతే ఎలా? అధ్యాపకుల కొరతతో విశ్వవిద్యాలయాలు ఒప్పంద అధ్యాపకులతో నెట్టుకొస్తున్నాయి. విద్యార్థుల సమస్యలు, శిక్షణా అవసరాల కంటే రాజకీయ అజెండాలకే విశ్వ విద్యాలయాల్లో ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. ప్రతిపక్ష పార్టీలను నిరోధించే వేదికలుగా, ప్రభుత్వ విధానాలను సమర్థించే ప్రచార కేంద్రాలుగా మారుతున్న ఈ విద్యా సంస్థలు తమ పరిపక్వతను కోల్పో తున్నాయి. విశ్వవిద్యాలయాల నిర్వహణ అధ్వాన్నంగా ఉంది. ఎటువంటి స్పష్టమైన పాలనా విధానం లేకుండా, అనుసంధాన కార్యక్రమాలు లేకుండా, విశ్వవిద్యాలయాలు కేవలం తమ తమ అస్తిత్వం కొనసాగించేందుకు మాత్రమే పరిమిత మవుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే, తెలుగు రాష్ట్రాల విద్యా వ్యవస్థ మరింత దిగజారిపోతుంది.**



రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా కేంద్రం మంజూరు చేసిన 'గిరిజన విశ్వవిద్యాలయా' లు పూర్తి స్థాయి క్యాంపస్‌లుగా రూపుదిద్దుకోలేదు. తాత్కాలిక అద్దె భవనాల్లోనే ఇంకా నెట్టుకొస్తున్నాయి. ఏర్పాటు చేసి దశాబ్దం కావొస్తున్నా ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా వీటి పరిస్థితి కొనసాగుతోంది. ఏ ఉద్దేశ్యంతో అయితే ఈసంస్థలు ఏర్పాటు చేయబడ్డాయో వాటిని అందుకోవడంలో విఫలమవు తున్నాం. కానీ వీటి గురించి ఆలోచించే నాథుడే లేకపోవడం గమనార్హం. విద్య, పరిశోధనల వైపు దృష్టి సారించాల్సిన అధ్యాపకులు పదవుల కోసం పాకులాడుతూ విద్యా వాతావరణాన్ని పాడు చేస్తున్నారు.

మన విశ్వవిద్యాలయాల్లో గ్లోబల్ (అంతర్జాతీయ) ప్రమాణాలను కల్పించేందుకు పలు చర్యలు తీసుకోవాలి. అధ్యాపకుల నియామకాన్ని తక్షణం చేపట్టాలి. పూర్తి స్థాయి అధ్యాపకులను నియమించి, వారి శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. విశ్వ విద్యాలయాల్లో పరిశోధన నిధులను పెంచాలి. పరిశోధనాపత్రాలను ప్రచురించేలా ప్రోత్సహించడంతోపాటు, విదేశీ విశ్వవిద్యాలయాలతో అను సంధానం చేయాలి. ఆధునిక మౌలిక వసతులు కల్పించి, అంతర్జాతీయ ప్రమాణాలకు సరిపోయే ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, డిజిటల్ లెర్నింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. విద్యార్థుల స్టార్ట్‌అప్‌లను ప్రోత్సహించే విధంగా నూతన విధానాలను అమలు చేయాలి. విశ్వవిద్యాలయాల పాలనలో పారదర్శకతను పెంచి, అకడమిక్ స్వాతంత్ర్యాన్ని పరిరక్షిస్తూ, రాజకీయ జోక్యాన్ని తగ్గించాలి.

అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల విధానాన్ని అనుసరించి, విద్యార్థులకు పరిశ్రమ అనుభవాన్ని పెంచే ఇంటర్న్‌షిప్‌లు, కో-ఆపరేటివ్ ప్రోగ్రామ్‌లను అమలు చేయడం అత్యవసరం. పరిశ్రమతో అనుసంధానం పెంచి, విద్యార్థులను వాస్తవ ప్రపంచ సమస్యల పరిష్కారానికి సిద్ధం చేయాలి. విద్యాబోధన, పరిశోధన రంగాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకురావడానికి...ప్రభుత్వాలు మౌలిక వసతుల కల్పనకు సమగ్ర ప్రణాళికలతో ముందుకు రావాలి. ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ విద్యా సంస్థలతో పోటీ పడటమే కాకుండా, పరిశోధన, నూతన ఆవిష్కరణల కేంద్రాలుగా మారతాయి. అప్పుడు ఎక్కడి నుంచో కొత్తగా విశ్వవిద్యాలయాలను, సంస్థలను తీసుకు రావలసిన అవసరమే ఉండదు.

## ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్

# ఆంజనేయులు అరెస్ట్

హైదరాబాద్ ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



**ఐపీఎస్ అధికారి, ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్ట్ అయ్యారు. ముంబయి నటి జత్వానీకి వేధింపుల కేసులో ఏపీ సీఐడీ అధికారులు ఆయన్ను హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. వైకాపా హయాంలో ఆంజనేయులు ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేశారు. మాజీ సీఎం జగన్‌కు ఆయన అత్యంత విధేయుడిగా వ్యవహరించారు. ప్రస్తుతం పీఎస్ఆర్ ఆంజనేయులు సస్పెన్షన్‌లో ఉన్నారు. హైదరాబాద్ నుంచి ఏపీకి ఆయన్ను తరలిస్తున్నారు. జత్వానీ కేసులో పూర్తిస్థాయిలో సీఐడీ అధికారులు విచారించనున్నారు.**

### అన్నీ తానై వ్యవహరించి..


ముంబయి నటి ఫిర్యాదు కేసులో పీఎస్ఆర్ ఆంజనేయులు రెండో నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో ఇప్పటికే విజయవాడ మాజీ సీపీ కాంతిరాణా తాతా, ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ సస్పెండ్ అయ్యారు. జత్వానీ వ్యవహారంలో వైకాపా ముఖ్యనేత చెప్పగానే పీఎస్ఆర్ ఆంజనేయులు రంగంలోకి దిగారు. ఆమెపై ఏ కేసు పెట్టాలి.. ఎలా అరెస్ట్ చేయాలనే విషయాలను అన్నీ తానై చూసుకున్నారు. ప్రణాళిక సిద్ధం కాగానే వైకాపా నేత కుక్కల విద్యాసాగర్‌ను పిలిపించి జత్వానీకి వ్యతిరేకంగా ఫిర్యాదు చేయించారు. తన ఆస్తిపై ఆమె తప్పుడు ఒప్పంద పత్రాల్ని సృష్టించి ఇతరులకు విక్రయించినట్లు ఇబ్రహీంపట్నంలో విద్యాసాగర్ ఫిర్యాదు చేశాడు.

ఆ తప్పుడు ఫిర్యాదు ఆధారంగా జత్వానీ, ఆమె తల్లిదండ్రులను పోలీసులు అరెస్ట్ చేశారు. ముంబయి వెళ్లి జత్వానీ, ఆమె తల్లిదండ్రులను అరెస్ట్ చేసి విజయవాడకు తరలించడం.. రిమాండ్‌కు పంపడం తదితర వ్యవహారాలను కాంతిరాణా, విశాల్ గున్నీ పర్యవేక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైకాపా హయాంలో అధికారులు తమపట్ల వ్యవహరించిన తీరుపై జత్వానీ ఫిర్యాదు చేశారు. తప్పుడు కేసుతో తీవ్రంగా వేధించారని పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదుతో విద్యాసాగర్‌తో పాటు పీఎస్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీలపై కేసు నమోదు చేశారు.

## విద్యుత్ రంగం బలోపేతానికి

# తక్షణ ఆర్థిక సాయం అవసరం.. గొట్టిపాటి

అమరావతి ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగం బలోపేతానికి ఆర్థికంగా సాయం చేయాలని ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ కేంద్రాన్ని కోరారు. విద్యుత్ శాఖ మంత్రుల సమావేశానికి హాజరైన కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యస్సో నాయక్ కు మెమోరాండాన్ని అందజేశారు. ఏపీ పెద్ద ఎత్తున పునరుత్పాదక విద్యుత్ ను ప్రోత్సహిస్తోందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. రాష్ట్రంలో ఉత్పత్తి చేస్తున్న పునరుత్పాదక ఇంధన మౌలిక సదుపాయాల కోసం గ్రీన్ ఎనర్జీ కారిడార్ ప్రాజెక్టుకు తక్షణ ఆర్థిక సాయం కేంద్రం అందించాలని కోరారు. జాతీయ క్లీన్ ఎనర్జీ లక్ష్యాలకు అనుగుణంగా పునరుత్పాదక విద్యుత్ ను జాతీయ గ్రిడ్ కు సమర్థవంతంగా కలిపేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఎంతో కీలకమని కేంద్ర మంత్రికి మంత్రి గొట్టిపాటి వివరించారు. అంతేగాకుండా రాష్ట్రంలో రెన్యూవబుల్ ఎనర్జీ మేనేజ్మెంట్ జోన్ (%=జుఫ్గీ%) ఏర్పాటు కోసం సమగ్ర ఆర్థిక, సాంకేతిక సహకారం అవసరమని పేర్కొన్నారు. %=జుఫ్గీ% ద్వారా గ్రీన్ ఎనర్జీ వనరుల అంచనా, షెడ్యూలింగ్, గ్రిడ్ నిర్వహణను మెరుగుపరచగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని గణనీయంగా మెరుగుపరచవచ్చని మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన ఎన్.పీ కుంట సోలార్ పార్క్ నుంచి ఉత్పత్తి అయ్యే పునరుత్పాదక విద్యుత్ పై జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్ (%+చీూ%) ఛార్జీల నుండి మినహాయించాలని కేంద్ర మంత్రి నాయక్ కు మంత్రి గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. ఈ పార్క్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్.. వినియోగదారులకు అందుబాటు ధరలో ఉండాలంటే మినహాయింపు అత్యంత అవసరమని మంత్రి గొట్టిపాటి వివరించారు. మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్న వివిధ అంశాలపై కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి సానుకూలంగా స్పందించారు.

# తెదేపా నేతలపై వేధింపులకు సీఐడీని వినియోగించిన జగన్

### హెూం మంత్రి అనిత

విజయవాడ ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**తెదేపా హయాంలో ఏ అధికారీ ఇబ్బంది పడలేదని ఏపీ హెూంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. వైకాపా అధికారంలో ఉన్న సమయంలో తప్పుడు పనులు చేయడం వల్లే అధికారులు ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్ట్ నేపథ్యంలో విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడారు.**

"మేం చాలా సందర్భాల్లో ప్రతిపక్షంలో ఉన్నాం. అప్పుడు మాపై కేసులు నమోదయ్యాయి. మా వల్ల ఏ అధికారీ ఇబ్బంది పడిన పరిస్థితి లేదు. గత వైకాపా పాలనలో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం మొదలు పెట్టారు. మా పార్టీ నేతలందరిపైనా తప్పుడు కేసులు పెట్టారు. తెదేపా కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. మహిళలు అని చూడకుండా బెదిరింపులకు పాల్పడ్డారు. తెదేపా నాయకులను వేధించడానికి సీఐడీని వినియోగించిన వ్యక్తి జగన్. కూటమి ప్రభుత్వంలో సాక్ష్యాలు లేకుండా పోలీసులు ఏ కేసులోనూ ముందుకెళ్లడం లేదు.



తప్పు చేసిన వారిని పారదర్శకంగానే శిక్షిస్తున్నాం. తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల్లో ఎంత ఆవేశం ఉన్నా, గత ప్రభుత్వంలో తప్పు చేసిన వారి పట్ల ఓ పద్ధతి ప్రకారం చట్టపరంగానే వెళ్తున్నాం. వైకాపా ప్రభుత్వంలో పనిచేసిన అధికారులే ఎందుకు అరెస్టు అవుతున్నారో ఆ పార్టీ ఆత్మవిమర్శ చేసుకోవాలి. జగన్ వల్ల గతంలో శ్రీలక్ష్మీ లాంటి అధికారులు జైలుకు కూడా వెళ్లారు" అని అనిత అన్నారు. జగన్ 4 గోడల మధ్య కాకుండా ప్రజల్లోకి వచ్చి అక్రమ కేసులు లాంటి మాటలు మాట్లాడితే, ప్రజలే సరైన సమాధానం చెప్తారన్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకే డోర్ డెలివరీ హత్య కేసు పునర్ విచారణ జరుగుతోందని అనిత తెలిపారు.

# తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో భారీగా భద్రతా బలగాలు

## కర్రెగుట్టల్లో టెన్షన్ టెన్షన్

వరంగల్, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో అలజడి రేగింది. తెలంగాణాలో ములుగు జిల్లాలోని కర్రెగుట్టలను 2 వేల మంది భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కర్రెగుట్టలు విస్తరించి ఉన్నాయి. కర్రెగుట్టల్లో భారీగా మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో ఆపరేషన్ చేపట్టారు. బచావో కర్రెగుట్టలు పేరుతో ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. అటు ఛత్తీస్‌గఢ్ నుంచి, ఇటు తెలంగాణ వైపు నుంచి కర్రెగుట్టలను సీఆర్పీఎఫ్ బలగాలు చుట్టుముట్టాయి. ఇప్పటికే కర్రెగట్టల చుట్టూ భారీ పేలుడు పదార్థాలు పెట్టినట్టుగా ప్రకటించిన మావోయిస్టులు.. ఆ వైపు ఆదివాసీలు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఏ క్షణం ఏం జరుగుతుందో అనే టెన్షన్ నెలకొంది. అయితే ఊసూర్ బ్లాక్‌లోని కర్రెగుట్టల సమీపంలో మంగళవారం ఉదయం నుంచి భద్రతా బలగాలు - మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగినట్లు తెలుస్తోంది. అయితే కాల్పులను పోలీసులు ధృవీకరించలేదు. కేవలం సెర్చింగ్ ఆపరేషన్ మాత్రమే చేస్తున్నామని, కాల్పులు జరపడం లేదని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు వారం రోజులు క్రితమే మావోయిస్టుల పేరుతో ఓ లేఖ విడుదలైంది. కర్రెగుట్టల చుట్టూ బాంబులు, లాండ్‌మైన్స్ అమర్చామని, ఎవరూ రావద్దంటూ వెంకటాపురం డివిజన్ ఏరియా శాంతా పేరుతో లేఖ విడుదల చేశారు. అయితే తర్వాత అదంతా కూడా ఫేక్ లేఖ అని పౌరహక్కుల నేతలు చెప్పారు. మావోయిస్టు సంఘాలు అలాంటి లేఖలు విడుదల చేయరని, శాంతా అనే పేరుతో ఎవరూ లేరని మావోయిస్టులు చెప్పినట్లుగా పౌరహక్కుల సంఘాలు తెలిపాయి. అయితే కర్రెగుట్టలో మాత్రం ఏం జరుగుతుంది అనే దానిపై ఇటు పోలీసులు, అటు మావోయిస్టులు ఎలాంటి సమాచారం ఇవ్వని పరిస్థితి.

### కాల్పులు ఆపండి: హరగోపాల్

కర్రెగుట్టలకు సంబంధించి పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ ఓ వీడియోను విడుదల చేశారు. తమకున్న సమాచారం మేరకు భద్రతా బలగాల వైపు నుంచి కాల్పులు జరుగుతున్నాయని, ఇప్పటికే 2వేల మంది భద్రతా బలగాలు కర్రెగుట్టల చుట్టూ మోహరించారని వెంటనే కాల్పులు ఆపాలని డిమాండ్ చేశారు. ఓ వైపు శాంతి చర్చల ప్రతిపాదన తెస్తూనే ఇటువంటి హత్యకాండకు ప్రభుత్వాలు తెగబడటం దుర్మార్గమన్నారు. ఈ ముసుగులో సాధారణ ప్రజానీకం మరణించవచ్చని తెలిపారు. వెంటనే సాయుధ చర్యలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ముందుగా శాంతి చర్చల అడుగులు పడాలని, ఆ ప్రతిపాదన మావోయిస్టుల నుంచి కూడా వచ్చిందని తెలిపారు. శాంతి చర్చలకు అడుగులు పడుతున్నాయని భావిస్తున్న తరుణంలో భద్రతా బలగాలను ఉసిగొల్పి మావోయిస్టులను పూర్తి స్థాయిలో అంతమొందించాలని చూడటంతో ఒక దుర్మార్గమైన చర్య అంటూ హరగోపాల్ ఓ వీడియోను విడుదల చేశారు.

# డబుల్ ఇంజిన్ సర్కార్ తో ఏపి అభివృద్ధి

### -కేంద్ర మంత్రి శ్రీపాద యశోద్ నాయక్

విజయవాడ, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



డబుల్ ఇంజన్ సర్కార్ తో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో పయనిస్తోందని కేంద్ర విద్యుత్, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి శ్రీపాద యశోద్ నాయక్ చెప్పారు. కేంద్ర మంత్రి శ్రీపాద్ యశోద్ నాయక్, మహారాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి మేఘనా దీపక్ సాకోర్ మంగళవారం నాడు విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నేతలు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి పవన్ బిజెపి నేతలను ఇరువురు మంత్రులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీపాద్ యశోద్ నాయక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో డబుల్ ఇంజన్ సర్కార్ ఆధ్వర్యంలో అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కు నిధులు వరదలా ప్రవహిస్తాయి అన్నారు. ఆంధ్రప్రదేశ్ మ్యాప్ లో ప్రాముఖ్యత తెలుసుకున్నారు. చంద్రబాబు నాయుడు నియోజకవర్గం గురించి అడిగి తెలుసుకున్నారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి విశిష్టత అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మంత్రాలయం గురించి అడిగారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో పార్టీ వేగవంతంగా పటిష్టం అవుతుందన్నారు. వారధి ఇంఛార్జి కిలారు దిలీప్, బిజెపి ప్రోటోకాల్ ఇంఛార్జి పీయూష్, బిజెపి సోషల్ మీడియా రాష్ట్ర సభ్యులు సంజయ్ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి, పోతిరెడ్డి వెంకట్, మహిళా మోర్చా నేతలు బొమ్మదేవర రత్నకుమారి, విజయశాంతి, పాలడుగు సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.౦




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

బుధవారం 23 ఏప్రిల్ 2025

# ఉమా సోమేశ్వరునికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**అమలాపురం, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
వన్నెచింతలపూడి గ్రామంలో వేంచేసి ఉన్న ఉమా సోమేశ్వర స్వామి వారి ఆలయం 12వ వార్షికోత్సవం సందర్భంగా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, నడింపల్లి అర్జున్ వర్మ, నడింపల్లి రాంబాబురాజు, దంతులూరి వాసురాజు, గ్రామ సర్పంచ్ శ్రీమతి నక్కా రాజారత్న నాగమణి కృష్ణ, అలాటి బాలయోగి, పరమాట రాంప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**కాట్రేనికోన, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎం ఈ ఓ వెంకటరమణ అన్నారు. వేట్లపాలెం ఎంపియుపి పాఠశాలలో ఎన్రోల్మెంట్ డ్రైవ్, పాఠశాల వార్షికోత్సవం కార్య క్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎం.ఈ.ఓ1 ఎస్.వి. లక్ష్మీ నారాయణ,ఎం. ఈ .ఓ2 ఎం .వెంకట రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం అని అన్నారు. అడ్మిషన్ డ్రైవ్ లో భాగంగా ఈ విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో 12 మంది విద్యార్థులను చేర్పించారు. విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, పెన్సిళ్లు, ఎక్కాలు పుస్తకం, పరీక్ష అట్టలు ఈ సందర్భంగా పంపిణీ చేశారు. ఈ విద్యా సంవత్సరానికి పాఠశాల మోడల్ ప్రైమరీ, హైస్కూల్ గా అప్ గ్రేడ్ అయిందన్నారు. ఉపాధ్యాయులు సంఖ్య కూడా పెరిగిందని, భవిష్యత్తులో అదనపు తరగతి గదులు కూడా వస్తాయని కావున మీ హాబిటేషన్ లో గల ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులను కూడా మన పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం విద్యా శాఖాధికారుల ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం లు ఎం.వెంకటేశ్వరరావు,కె. శ్రీరామ కృష్ణ, ఎ.ఎస్.ఎం వర్మ, పి.జగన్నాధ రావు, ఎస్ ఎం సి చైర్మన్ పాము వెంకటేశ్వరరావు,ఎస్ఎంసి సభ్యులు, గ్రామస్తులు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# సాయిరాం మృతి తీరనిలోటు

**-సర్పంచ్ సబ్బితి మోహన్ రావు.**



**రావులపాలెం ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగ సంఘాల కార్యదర్శి నిమ్మకాయల సాయిరాం అకాల మరణం తమను తీవ్రంగా కలిసి వేసిందని గోపాలపురం గ్రామ సర్పంచ్ సబితి మోహన్ రావు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోపాలపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సంతాప సభలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గ్రేడ్1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ఇదే గ్రామంలో అన్ని వర్గాల ప్రజల మనలను పొందుకొని చేదోడు వాదోడుగా ఉంటూ అందరినీ కలుపుకొని గ్రామాన్ని అభివృద్ధి పదంలోకి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేసిన కార్యదర్శి సాయిరాం మృతి తమకు తమ పంచాయితీకి తీరని లోటని సర్పంచ్ సబ్బితి మోహన్ రావు పేర్కొన్నారు. అలాగే తోటి ఉద్యోగులు మాట్లాడుతూ గ్రేడ్ వన్ పంచాయతి కార్యదర్శి ఉన్న తాము చిన్న స్థాయి ఉద్యోగుల మైనప్పటికిని అందర్నీ కలగలుపుని చిన్న పెద్దాయన తేడా లేకుండా చిరునవ్వుతో ఆప్యాయత అనురాగాలతో పని చేసుకుని ముందుకు పోవాలని ఆకాంక్షతో ఉండాలని నిత్యం ప్రోత్సహిస్తూ ముందుండే వ్యక్తి సాయిరాం అకాల మరణం చాలా బాధాకరమని సచివాలయం సిబ్బంది రెవిన్యూ సిబ్బంది వైద్య సిబ్బంది తదితరులు పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

**అమలాపురం, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
వన్నెచింతలపూడి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు.
అనంతరం పిఎసిఎస్ నందు ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. గత వైసీపీ పాలనలో పండించిన ధాన్యం అమ్ముకోవడానికి కూడా రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. టిడిపి ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, నడింపల్లి అర్జున్ వర్మ, నడింపల్లి రాంబాబురాజు, దంతులూరి వాసురాజు, గ్రామ సర్పంచ్ శ్రీమతి నక్కా రాజారత్న నాగమణి కృష్ణ, అలాటి బాలయోగి, పరమట రాంప్రసాద్, పరమట చిట్టిబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీల సహకారం ముఖ్యం

**- ఈనెల 1వ తేదీ నుంచి ఓటు హక్కు నమోదుకు అవకాశం**
**- జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి**





**అమలాపురం, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి ఎన్నికకు సంబంధించి పూర్తి అవగాహన పెంచుకుని ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా పారదర్శకంగా జరిగేలా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారి బి.ఎల్.ఎన్.రాజకుమారి కోరారు. మంగళవారం అమలాపురం డిఆర్ఓ ఛాంబర్ లో ఆమె అధ్యక్షతన జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పరిగణించే ఎన్నికలను ప్రభుత్వ జోక్యం లేకుండా స్వేచ్ఛగా నిర్వహించేందుకు రాజ్యాంగ నిర్మాతలు స్వయం ప్రతిపత్తి గల కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేసారన్నారు. ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో ముఖ్యమన్నారు. ఎన్నికల కమిషన్ తీసుకొస్తున్న పలు సంస్కరణలు, నిబంధనలను రాజకీయ పార్టీలకు తెలియజేసేందుకు ప్రతినెల సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఓటర్ల జాబితాలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని తమ దృష్టికి తెస్తే సరి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ఓటు నమోదు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. గతంలో కొత్తగా ఓటు హక్కు పొందాలంటే జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి అవకాశం ఉండేదని, ఎన్నికల సంఘం ఆ నిబంధనను సడలించి జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ నెలల్లో 1వ తేదీ నాటికి అర్హత కలిగిన యువత ఓటు నమోదుకు అవకాశం కల్పించిందన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా రాజకీయ పార్టీలు, సహకారం అందించాలని మీ సేవా కేంద్రాలతోపాటు వినియోగదారుల సేవా కేంద్రాల్లో, మొబైల్ ఫోన్లలో ఓటు హక్కు నమోదు చేసుకొనవచ్చున్నారు. ఒక ఫొటో, ఆధార్ కార్డు, కుటుంబ పెద్ద ఓటరు కార్డు నెంబర్ సిద్ధంగా ఉంచుకుని నమోదు చేయాలి. మొదట రాష్ట్రం, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గం ఎంచుకోవాలని, ఆనంతరం వ్యక్తిగత వివరాలు నిర్దేశిత అంశం వద్ద తప్పుల్లేకుండా నమోదు చేయాలన్నారు. చివరగా ఇచ్చిన వివరాలన్నీ వాస్తవమేనని డిక్లరేషన్ ఇచ్చి సబ్మిట్ చేస్తే బి.ఎల్.ఓ స్థాయిలో విచారణ చేసి ఓటరు కార్డును జారీ చేస్తారని ఆన్లైన్లో నమోదు చేసుకోలేకపోతే సంబంధిత వార్డులో బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ) లను సంప్రదించి మ్యానువల్గా సైతం నమోదు చేసుకో వచ్చునన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ నమోదులో సమస్యలు సందేహాలు ఉంటే తమ దృష్టికి తెచ్చి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ తరఫున దూరి రాజేష్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున వడ్డి నాగేశ్వరరావు, బహుజన సమాజ్ పార్టీ తరఫున భవాని, డీటీ శివరాజ్, జూనియర్ అసిస్టెంట్ సాయిరాం పాల్గొన్నారు.

## కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మను సత్కరించిన బిజెపి నాయకులు నానాజీ


**కాట్రేనికోన, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సోమవారం బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు స్వగృహానికి విచ్చేసారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి వెంట బిజెపి పూర్వపు జిల్లా అధ్యక్షులు యాళ్ల దొరబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, టిడిపి సీనియర్ నాయకులు గంధం పల్లంరాజు, పాలూరు సత్యానందం, మట్ట సూరిబాబు అల్లాడ శరత్, రేవు శ్రీను, రాయపురెడ్డి రాజా, దున్నాల దుర్గ తదితరులు పాల్గొన్నారు.



# పోప్ ఫ్రాన్సిస్ కి చిత్ర నీరాజనం

**కాట్రేనికోన, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
క్యాథలిక్కుల అత్యున్నత మత గురువు పోప్ ఫ్రాన్సిస్ తన యావత్తు జీవితాన్ని ప్రభువు సేవకై అంకితం చేసారు. విశ్వాసం, ధైర్యం, విశ్వ మానవ ప్రేమ, నిరుపేదలు, బలహీనుల కోసం, సువార్త విలువలతో జీవించాలని ప్రభోదనలు చేస్తూ... ఏసుక్రీస్తు కు నిజమైన శిష్యునిలా జీవించిన పోప్ ఫ్రాన్సిస్ అందరినీ దుఃఖ సాగరంలో ముంచి ప్రభువు వద్దకు చేరుకున్నారు. ఆయన కు ఘన నివాళులర్పిస్తూ ప్రముఖ చిత్ర కారుడు అంజి అకొండి గీసిన చిత్రం.

**చిత్ర నిరాజనం**
**అంజి ఆకొండి**
**కాట్రేనికోనజి**



# జగన్ ని మర్యాదపూర్వకంగా కలిసిన జగ్గిరెడ్డి.

**రావులపాలెం ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఇటీవల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసిపి పార్టీ అధ్యక్షులుగా నియమితులైన చిర్ల జగ్గిరెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లి ఆయన స్వగృహం వద్ద మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి వారి ప్రతిమ అందజేసి ధన్యవాదాలు తెలియజేశారు.




# బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమావేశం



**ఐ.పోలవరం ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
మురమళ్ల గ్రామంలో నిత్యకల్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయంలో మే 1 నుండి 5 వతేది వరకు జరగబోయే బ్రహ్మోత్సవ ఏర్పాట్లు పై మంగళవారం ఆలయ సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఆలయ అర్చక, పురోహిత బృందం తో సమావేశం ఏర్పాటు చేశారు. శైవాగమ పండితులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్య సీతారామ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఐదు రోజులపాటు శాస్త్రోక్తంగా జరగనున్నట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఇందులోభాగంగా మే 1 వతేది బ్రహ్మోత్సవ కల్యాణం వైభవోపేతంగా జరుగుతుందన్నారు. అలాగే గ్రామోత్సవ ఏర్పాట్లు గురించి చర్చించారు. దేవస్థానం వెబ్సైట్ నందు కల్యాణం టికెట్స్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి స్థానిక శాసన సభ్యులు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు దంపతుల తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఏర్పాట్లు పై అర్చకులు, పురోహితులు, వేదపండితులతో, కార్యాలయ సిబ్బంది తో చర్చించారు. బ్రహ్మోత్సవాలలో స్థానికులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

## ముత్యాల, మేడ మహా మిత్రమండలి ఆధ్వర్యంలో ధరిత్రీ దినోత్సవం....

**రాజమహేంద్రవరం ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఏజెన్సీ టైగర్ క్లిక్ చేసిన ముత్యాల ముత్యాల రాయుడు మిత్రమండలి మరియు మేడ మహామిత్ర మండలి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ సమీపంలో ధరిత్రి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. న్యాయవాదులు సుంకర వెంకట భాస్కర రంగారావు, ధర్నాలకోట వెంకటేశ్వరరావు, పేడూరి అంబేద్కర్ లు ఈ కార్యక్రమంలో పాల్గొని పర్యావరణ కాలుష్యం నుండి భూమిని రక్షించుకోవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు.



# ప్రైవేట్ కి దీటుగా ప్రభుత్వ పాఠశాలలు. -ఎమ్మెల్యే సత్యానందరావు

**రావులపాలెం ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా ప్రయివేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలని ప్రభుత్వం కృషిచేసి నేడు ఆ విధంగా ముందుకు సాగుతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండలం రావులపాడు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే, ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని నిర్వహించిన ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అలాగే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సత్యానందరావు అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ గెడ్డం త్రిమూర్తులు, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ నాగకుమార్, శ్రీనివాస్ రాజు, సర్పంచ్ సత్యదేవి బాబ్జి, ఎంపీటీసీ కిషోర్, మాజీ సర్పంచ్ వెంకన్న, పెచ్చుటి చిన్న నాగార్జున, గెడ్డం శ్రీను, మురళి, రాము, సూర్యనారాయణ, హెడ్మాస్టర్ సునీత, ఉపాధ్యాయులు జ్యోతిబసు, కెవి శేఖర్, శ్యామల కుమారి, వీరవేణి, మేరీ జోన్స్, హిమాజ, వెంకటలక్ష్మీ, పద్మజ, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తెలుగురాష్ట్రం దినపత్రిక


జనరల్ న్యూస్

https://epaper.teluguraastram.com

అమలాపురం
ఏప్రిల్ 23,
బుధవారం 2025



# అన్నవరంలో ఏడీసీ విచారణ



కాకినాడ ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

దేశంలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న అన్నవరంలో కొన్ని వివాదాలు ఏర్పడ్డాయి. దీంతో దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ చంద్రకుమార్ మంగళవారం అన్నవరం విచ్చేశార. కుటుంబ సభ్యులతో వ్రతం చేయించుకున్నారు. అనంతరం దేవస్థానంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. కొండపై జరుగుతున్న అక్రమాలు, వస్తున్న ఆరోపణలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈవో వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయి అంటూ ప్రశ్నించారు. పూర్తి నిష్పక్షపాతంగా సహకరించాలని వారికి సూచించారు .విచారణ నివేదికను రాష్ట్ర కమిషనర్ కు అందజేస్తానని, మీడియాతో మాట్లాడేది లేదని స్పష్టం చేశారు .ఈ సందర్భంగా ఉద్యోగులు కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ విచారణలో కాకినాడ డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

# టిడిపి సంస్థాగత ఎన్నికలపై సమావేశం



పెద్దాపురం, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

టిడిపి సంస్థాగత ఎన్నికల నిర్వహణ నిమిత్తం పెద్దాపురం నియోజకవర్గం అచ్చంపేటలో ఎంఎల్ఏ నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన మంగళవారం నాడు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గం టిడిపి పరిశీలకులు, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ళ వెంకటరమణ పాల్గొని కమిటీల ఏర్పాటుపై దిశా నిర్దేశం చేశారు. సామర్లకోట మండల కెఎస్ఎస్, గ్రామ, బూత్, యూనిట్, క్లస్టర్, మండల కమిటీల నిర్మాణంపై చర్చించారు. పార్టీ కోసం కష్ట పడి పని చేసిన వారికి, మహిళ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని వెంకటరమణ కోరారు.

# పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న బడేటి చంటి





ఏలూరు, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పోషక విలువలతో కూడిన ఆహారమే ఆరోగ్య పరిరక్షణకు కీలకమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని లక్ష్యసాధన దిశగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత వారికి ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారాల ప్రదర్శనను తిలకించిన ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్‌లు ఆహారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం చేసే మేళ్ళను వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై ప్రత్యేక దృష్టిసారించిందని చెప్పారు. బిడ్డల ఆరోగ్యకర భవిష్యత్తుకు తల్లిపాలే కీలకమని పేర్కొన్న ఎమ్మెల్యే చంటి ఆరోగ్యమే ఉన్నతాలోచనకు ముఖ్యమని అటువంటి మేధావులే రాష్ట్ర, దేశాభివృద్ధికి అవసరమని అభిప్రాయపడ్డారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో పౌష్టికాహారాన్ని అవసరార్ధులకు అందించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తోన్న ఆలోచనలో తల్లులంతా భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి కె. శారద, కార్పొరేషన్ కమిషనర్ ఎ. భానుప్రతాప్, డిప్యూటి మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కో - ఆప్షన్ సభ్యులు ఎస్సెమ్మార్ పెదబాబు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని బ్యాగులు కొరత రాకుండా చూడాలి

**సంబంధిత మిల్లర్ నుండి గన్ని బ్యాగులను ముందుగానే సేకరించుకుని స్టాక్ నిల్వ ఉంచాలి.**

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి**



భీమవరం ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మంగళవారం ఉండి మండలం యండగండి గ్రామంలోని రైతు సేవా కేంద్రమును జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. రైతులతో మాట్లాడుతూ రైతు సేవ కేంద్రం ద్వారా కొనుగోలు సక్రమంగా జరుగుతుందా, అధికారులు అందరూ మీకు సహకరిస్తున్నారా, ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలపాలని అన్నారు. తేమ శాతమును రైతులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా సేకరిస్తున్న ధాన్యం కొనుగోలు అన్ని బాగున్నాయని, అధికారులు సకాలంలో స్పందిస్తున్నారని రైతులు తెలిపారు. గోనె సంచులు కొరత ఉందని రైతులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా యండగండి సొసైటీ స్టాక్ ను పరిశీలించారు. సంబంధిత రైస్ మిల్లర్లతో ఫోన్లో మాట్లాడారు. మిల్లులు వారీగా ట్యాగ్ చేసి అవసరమైన రైతులకు 20 వేలు గోనె సంచులను అందజేయాలని తాహసిల్దార్, సొసైటీ అధికారులను ఆదేశించారు. డామేజీ ఏమైనా ఉంటే వెంటనే రిఫర్ చేసి కొత్తవి తీసుకోవాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు. ఎంత స్టాకు తీసుకున్నాము, రైతులకు ఎంత అందజేస్తున్నాం రిజిస్టర్లలో నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 2024 - 25 సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయటం జరుగుతుందని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మిల్లుకు ధాన్యం తోలిన 48 గంటలు వ్యవధిలో రైతు ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని అన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలు కొరకు కావలసిన అన్ని ఏర్పాట్లను చేయటం జరిగిందని తెలిపారు. గోనే సంచులు కొరత లేకుండా చర్యలు తీసుకోవటం జరిగిందని రైతులకు సకాలంలో అందజేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో రైతు సేవా కేంద్రాల ద్వారా 59 లక్షల గోనె సంచులు పంపిణీ చేయడం జరిగినదని తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రాలో అవసరమైన గోనెసంచులను ముందుగానే సంబంధిత రైస్ మిల్లర్ల నుండి తీసుకుని రైతుల కొరకు అందుబాటులో ఉంచడం జరిగిందని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకొవాలన్నారు. ఈ సందర్భంలో తహసిల్దార్ కె.నాగార్జున, ఎంఏఓ బి.సంధ్య, ఎంఎల్ఓ వర్జిని, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు, తదితరులు ఉన్నారు.

# యువతి వివాహానికి మానవత ఆర్థిక సహాయం...



పాలకొల్లు, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పేదరికంలో ఉన్న యువతి వివాహానికి ఆర్థిక సహాయం చేయగలటం ఎంతో సంతోషంగా ఉందని మానవతా కన్వీనర్ ముత్యాల రామారావు అన్నారు. పోడూరు మండలం జిన్నూరు గ్రామ శివారు భూపయ్య చెరువు ప్రాంతానికి చెందిన జ్యోతి అనే పేద యువతి వివాహానికి మానవత తరఫున సోమవారం రూ16,250 నగదు, నూతన వస్త్రాలు బహుకరించారు. ఈ సందర్భంగా మానవతా సభ్యులు, దాతలకు జిల్లా ఆత్మీయ కమిటీ డైరెక్టర్ ముత్యాల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా కోశాధికారి ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్,రోటరీ ప్రెసిడెంట్ రావాడ సతీష్, రోటరీ ట్రెజరర్ పొతాబత్తుల సత్యనారాయణ, మానవత సభ్యులు విన్నకోట వెంకటరమణ,ముత్యాల నాగకుమారి, గుడాల హరిబాబు, హెల్త్ సూపర్వైజర్ చిట్టూరి పద్మకుమారి, ఏఎన్ఎం ఏ గౌరీదేవి,హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘంటసాల భద్రమ్మ కన్నుమూత

ఏలూరు, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఇక్కడికి సమీపంలోని శ్రీపర్రు గ్రామంలో ఘంటసాల భద్రమ్మ కన్నుమూశారు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరికీ చేదోడు వాదోడుగా ఉంటూ, నలుగురికి సేవ చేయాలని సంకల్పంతో ఆవిడ జీవించారు. వ్యవసాయదారులకు చెందిన ఈ కుటుంబంలో ఆమె భర్త అంతర్వేదరావు ఏడాదిన్నర క్రితం మృతి చెందారు. కుమారుడు రాఘవేంద్రరావు వ్యవసాయం చేస్తున్నారు. కుమార్తె నాగలక్ష్మి భర్త నరసన్న కూడా వ్యవసాయం చేస్తున్నారు. మరో కుమార్తె సీత భర్త రాధాకృష్ణ వన్ టౌన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్నారు. దివంగత ఘంటసాల భద్రమ్మ అంతిమయాత్ర ఎంతో ఘనంగా జరిగింది. గ్రామస్తులంతా కలిసి ఆమెకు నివాళులర్పించారు. ఘంటసాల భద్రమ్మ కుటుంబానికి వారు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## బార్ అసోసియేషన్
# ఎన్నికలు సజావుగా సాగాయి..

**గణ విజయం సాధించిన పలువురు లాయర్లు**

కాకినాడ ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



కాకినాడ బార్ అసోసియేషన్ 2025-26 సంవత్సరానికి సోమవారం ఎన్నికలు జరిగాయి.ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఏలూరి సుబ్రహ్మణం 238. ఓట్లుతోవిజయం సాధించారు.అధ్యక్ష పదవికీ ఇద్దరు పోటీ చేసిన ఏలూరి సుబ్రహ్మణంకు 621ఓట్లు రాగా, పెందుర్తి ప్రసన్నకుమార్కు 385. ఓట్లు రాగా ఏలూరి సుబ్రహ్మణం 238 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు.జనరల్ సెక్రటరీ పదవికీ నలుగురు పోటీ చేసిన చెక్కపల్లి వీరభద్రరావు (చంటి) 576 ఓట్లు రాగా, రెడ్డి అన్నవరం 284 ఓట్లు రాగా చెక్కపల్లి వీరభద్రరావు 292. ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. కేవీవీఎస్ఎస్ మూర్తికి 119ఓట్లు రాగా,ఓ సత్యనారాయణకు 24 స్వల్పంగా ఓట్లు వచ్చాయి.ఉపాధ్యక్ష పదవికీ పోటీ చేసిన పెన్మెత్స రామచంద్రరాజుకు 654 ఓట్లు రాగా, ముత్తా వెంకన్నకు 350ఓట్లు రాగా పి. రామచంద్రరాజు 304 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు.జాయింట్ సెక్రటరీ పదవికీ బండి నరేంద్రకు 298 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు.కోశాధికారి పదవికీ కొకా వెంకటకృష్ణారావుకు 300 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ పదవికి జోకా వీఎస్ విజయకుమార్ 61 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. గిం.జాల చక్రవర్తి (387) మంగా వెంకట శివరామకృష్ణ (171) లేడీస్ రిప్రజెంటివ్ పదవికి జి.దివ్వ శ్రీవిద్య గెలుపొందారు.సీనియర్ కమిటీ మెంబర్ సక్కా సంజీవ్కుమార్కు 88 ఓట్లు గెలుపొందారు.జూనియర్కమిటీ సభ్యులుగా మర్ల ప్రవల్లిక (756) గుత్తుల మంగరాజు (668) షేక్ ప్రేమ్నబీర్(688) దుళ నాగబాబు(618)కాకినాడ బార్ అసోసియేషన్ 2025బి26 సంవత్సరానికి ఎన్నికల జరిగిన విషయం తెలిసిందే.

## ఎం.పి పురందేశ్వరి పుట్టినరోజు సందర్భంగా
# ప్రత్యేక పూజలు



దేవరపల్లి, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి జన్మదిన సందర్భంగా దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి సమేత శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో ఈరోజు ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు వై.సుజన శర్మ ఆధ్వర్యంలో చర్లగటి గోత్రం దగ్గుబాటి వెంకటేశ్వరరావు పురందేశ్వరి దంపతులు పేరుమీద అభిషేకం, అర్చన మరియు విశేషం పూజలు నిర్వహించినారు మరియు తీర్థప్రసాదాలు వితరణ ఆలయ కమిటీ సభ్యులు బలుసు సత్యనారాయణ విజయలక్ష్మి దంపతులు నిర్వహించినారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొయ్యలమూడి సురేంద్రనాథ్ చటర్జీ, మొక్కపాటి శ్రీనివాసరావు, ఈడుపుగంటి శివరాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

# ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలి

**ఎంఆర్ పాలెం చంటి పకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన కలెక్టర్**



కడియం, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలని అందుకు అధికారులు తగిన అవగాహన వారికి కల్పించాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. కడియం మండలం మాదవరాయడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఆయన సాగు చేస్తున్న వరితో పాటు మినప, పెసర, నువ్వు తదితర పంటలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వాటి దిగుబడులు, సాగు విధానం మార్కెటింగ్ వంటి విషయాలపై సర్పంచ్ చంటిని అడిగి తెలుసుకున్నారు. ఇలా రైతులు ముందుకు వచ్చి పకృతి వ్యవసాయం చేయడం వల్ల ఆరోగ్యకరమైన పంటలు ప్రజలకు అందుతాయన్నారు. ఎరువులు, పురుగు మందుల ఖర్చులు తగ్గుతాయన్నారు.అలాగే భూసారం పెరుగుతుందని కలక్టర్ తెలిపారు. జిల్లాలో 34 వేల మంది రైతులు 37 వేల ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేపడుతున్నట్లు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ బి. తాతారావు, వ్యవసాయ శాఖ జెడి ఎస్.మధుసూదనరావులు కలెక్టర్ కు వివరించారు. వీటిలో 18 వేల ఎకరాలు వరి పంట కాగా మిగిలినవి ఉద్యాన పంటలుగా సాగవుతున్నట్లు వివరించారు. పకృతి వ్యవసాయం చేయడం వల్ల వచ్చే దిగుబడులు ఎరువులు పురుగులు మందుల వాడడం వల్ల వచ్చే దిగుబడులకు వ్యత్యాసం ఇరవై అయిదు శాతం ఉంటుందని అయినప్పటికీ ఈ ప్రకృతి వ్యవసాయం లాభదాయంగా ఉంటుందని అధికారులు కలెక్టర్ కు వివరించారు. అయితే రైతులకు ఏ విధంగా అవగాహన కల్పిస్తున్నారు అనే దానిపై కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. మరింతమంది రైతులు ఈ ప్రకృతి వ్యవసాయం చేయడానికి ముందుకు వచ్చే విధంగా అధికారులు తగిన సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ సూచించారు. అలాగే రైతులకు నవధాన్యాల కిట్లను కలెక్టర్ అందేశారు.తొలుత సర్పంచ్ చంటి కలెక్టర్ ప్రశాంతికి నాగలి,వరికంకి ఇచ్చి తన వ్యవసాయ క్షేత్రంలోకి స్వాగతం పలికారు. కలెక్టర్ వెంట జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుజాత, ఎంపీడీవో కె.రమేష్, తాసిల్దార్ ఎం సునీల్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారిని కె ద్వారకా దేవి,ఉద్యానవన శాఖ అధికారి సుధీర్, కడియపులంక మాజీ సర్పంచ్ పుల్లా రామారావు, జేగురుపాడు ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నవదంపతులకు "మహేష్ అన్న పెళ్లి కానుక" అందజేత

ఏలూరు, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వివాహ బంధంతో ఒకటైన నూతన దంపతులకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తన కార్యాలయం సిబ్బంది ద్వారా "మహేష్ అన్న పెళ్లి కానుక" అందజేశారు. దెందులూరు మండలం, అలుగులగూడెం గ్రామానికి చెందిన దాసే చింతయ్య, రంగమ్మ దంపతుల కుమారుడు ఉదయ భాస్కర్ కు, ఏలూరు జిల్లా ధర్మాజీగూడెంనకు చెందిన జాస్మిన్ రాణితో ఏలూరు పట్టణ పరిధిలోని కంద్రిక గూడెం సెంటర్ లో గల శుభలేఖ కళ్యాణ మండపంలో మంగళవారం వైభవంగా వివాహం జరిగింది. ఆహ్వానితుల పిలుపు మేరకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తన కార్యాలయం ప్రతినిధుల ద్వారా "మహేష్ అన్న పెళ్లి కానుక" అందజేయించారు. అలాగే నూతన దంపతులకు ఆశీస్సులు అందించారు.



తెలుగురాష్ట్రం దినపత్రిక

## చిన్నారి వైద్యానికి మైత్రీ ఫౌండేషన్ లక్ష ఆర్థిక సాయం అభినందనీయం. - కొనకళ్ళ



**మచిలీపట్నం, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మచిలీపట్నం స్థానిక టెంపుల్ కాలనీ చెందిన మహమ్మద్ సుభాని జరీనా దంపతులకు 10 రోజుల క్రితం పాప జన్మించగా రక్తంలో ఇన్ఫెక్షన్ మరియు ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా అత్యవసర చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. నిరుపేద అయినా సుభాని కూలి చేసుకుని జీవనం సాగించే ఆ కుటుంబం అప్పులు చేసి రూ: 4 లక్షలు ఖర్చుపెట్టారు. అయినప్పటికీ పాప పూర్తిగా కోలుకోవడానికి ఇంకో రూ:3 లక్షలు అవసరం అనితెలిసి సాయం కోసం మైత్రి ఫౌండేషన్ ను సంప్రదించగా ఫౌండేషన్ సభ్యులు,దాతలు, బాధిత కుటుంబ స్నేహితులు మొత్తం అందరూ కలిసి రూ: 1లక్ష విరాళాలు సేకరించగా వచ్చిన నగదును ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జగన్నాథరావు బుల్లయ్య చేతుల మీదగా బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం మంగళవారం అందించడం జరిగింది. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ గత కొంత కాలంగా మైత్రి ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాల గురించి తాను మీడియా ద్వారాతెలుసుకుంటున్నానని చాలా మంచి కార్యక్రమాలు చేస్తున్నారని తన వంతు సహకారం ఎల్లపుడూ సంస్థకు ఉంటుందని అభినందించారు. బుల్లయ్య మాట్లాడుతూ సేవే ధ్యేయం గా ఏర్పడిన మైత్రి ఫౌండేషన్ అనే సంస్థ లో అందరూ చిన్న చిన్న ఉద్యోగాలు వ్యాపారాలు చేసుకునే వాళ్ళు సభ్యులుగా ఉండి ఎవరికైన సాయం చేయాల్సి వచ్చినప్పుడు ఒక జట్టుల ఏర్పడి విరాళాలు సేకరించడం సమాజంలో మేమున్నామని వారికి మనోధైర్యం కల్పించడం చాలాగొప్ప విషయం అన్నారు లక్ష రూపాయల విరాళం సేకరించడంలో ప్రత్యేకంగా కృషి చేసిన జాయింట్ సెక్రెటరీ చిలంకుర్తి దీప్తిని సభ్యులు అభిజిత్, అధ్యక్ష కార్యవర్గ సభ్యులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కె. వేణుకుమార్, ఉపాధ్యక్షులు రిలాక్స్ ప్రసాద్, సెక్రెటరీ రాధా కృష్ణ, జాయింట్ సెక్రెటరీ దీప్తి, సభ్యులు వక్కంటి రమాదేవి, అభిజిత్ మరియు వారి మిత్ర బృందం పాల్గొన్నారు.

## బాల త్రిపుర సుందరి అమ్మవారికి 105 గ్రాముల వెండి విరాళం



**భీమవరం ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భీమవరం మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి పీఠానికి దాతలు విరాళాలు అందిస్తున్నారు. మంగళవారం పట్టణానికి చెందిన కోళ్ల విజయ్ కుమార్, సుకన్య దంపతులు 105 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. అమ్మవారి వెండి పీఠానికి దాతలు ముందుకు వచ్చిన విరాళాలు అందిస్తున్నారని కమిటీ సభ్యులు తెలిపారు.

## మలబార్ గోల్డ్ లో తన్విక ఆభరణాల ప్రదర్శన

### అక్షయ తృతీయతో ఆఫర్లను ప్రకటించిన మలబార్ గోల్డ్



**భీమవరం ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అక్షయ తృతీయ పర్వదినం శుభసందర్భాన్ని ప్రత్యేక డీల్స్, బంగారు ఆభరణాల తరుగు చార్జీలపై 25 శాతం వరకు తగ్గింపు అందిస్తోందని మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపి అహ్మద్, భీమవరం స్టోర్ హెడ్ ఇంతియాజ్ తెలిపారు. ప్రీషియస్ ఫోన్స్ అండ్ అన్ కట్ డైమండ్స్ ఆభరణాల తరుగు చార్జీలపై ఫ్లాట్ 25 శాతం తగ్గింపు, వజ్రాల విలువపై 25 శాతం వరకు తగ్గింపు అందిస్తోందని, ఎంతో విలువైన వృత్తి నైపుణ్యం మేళవించిన ఆభరణాలలో వినియోగదారులు పెట్టుబడి పెట్టడానికి ఈ పండుగ ఆఫర్లు అసాధారణమైన అవకాశాలను కల్పిస్తున్నాయని అన్నారు. ఈ పండుగ కొనుగోలు అనుభూతిని మరింత లాభదాయకంగా మార్చడానికి అడ్వాన్స్ బుకింగ్లతో ఉచితంగా వెండి నాణెం అందిస్తోందని అన్నారు. అక్షయ తృతీయ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని మలబార్ గోల్డ్ 'డివైన్' అనే ప్రత్యేకమైన బ్రాండ్ కింద 'తన్విక' కొత్త ఆభరణాల సేకరణను ఆవిష్కరించిందన్నారు. భక్తి స్ఫూర్తిని జరుపుకునే డిజైన్లతో ఈ ఆభరణాలు రూపొందించబడ్డాయని, ప్రతి ఆభరణం కాలాతీత సంప్రదాయాలు, పండుగ సమృద్ధిని ప్రతిబింబిస్తాయని అన్నారు.

# కార్యకర్తను కుటుంబ సభ్యునిగా భావించేది టీడీపీయే

### వారి సంక్షేమానికి కృషి చేయడం మా కర్తవ్యం - కార్యకర్త కుటుంబానికి బీమా అందించిన ఎమ్మెల్యే శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కార్యకర్తను కుటుంబ సభ్యునిగా భావించి వారి సంక్షేమానికి పాటుపడే ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం పార్టీ ఇతర పార్టీలకు ఆదర్శమని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు) అన్నారు. కార్యకర్తకు బీమా సదుపాయం కల్పించి వారికి ఆర్థిక భరోసా కల్పించే పార్టీ తమ టిడిపియేనని వ్యాఖ్యానించారు. ఇటీవల మృతిచెందిన 33వ వార్డు టీడీపీ కార్యకర్త పొన్నాడ వెంకట రవికుమార్ కుటుంబానికి రూ.5 లక్షల బీమా నగదు మొత్తం నామిని అయిన రవి కుమార్ సతీమణి వనిత బ్యాంకు ఖాతాకు జమ కాగా మంత్రి లోకేష్ పంపిన లేఖను మంగళవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆమెకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం, శ్రేయస్సు కోసం పాటుపడే టీడీపీ వారి కుటుంబానికి కూడా అండగా ఉంటుందని అన్నారు. కార్యకర్తకు వచ్చే రూ.5 లక్షల బీమా మొత్తం ఎవరి ప్రమేయం లేకుండానే మృతుడి కుటుంబ సభ్యుల్లో నామిని బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని ఆయన తెలిపారు. ఆ విధంగానే మృతి చెందిన పొన్నాడ వెంకట రవి కుమార్ సతీమణి వనిత బ్యాంకు ఖాతాలో బీమా మొత్తం రూ.5 లక్షలు జమ అయిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. పార్టీ కోసం పని చేసిన రవి కుమార్ లేకపోయినా ఆయన కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి పిల్లల చదువుల కోసం తమవంతు సహాయ సహకారాలు అందచేస్తామని హామీ ఇచ్చారు. రవికుమార్ కుటుంబానికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి



నారా లోకేష్ ఒక లేఖ పంపించారని, తెలుగుదేశం పార్టీకి, ప్రజలకు కార్యకర్తగా పొన్నాడ వెంకట రవి కుమార్ ఎంతోసేవ చేశారని, కష్టకాలంలో పార్టీ వెన్నంటి నడిచారని ఆయన అకాల మరణం టీడీపీ కుటుంబానికి తీరని లోటని ఆ కుటుంబానికి ప్రగాఢ సంతాపం ప్రకటించారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. రవి కుమార్ సతీమణి వనిత పేరున బ్యాంకు ఖాతాలో జమ అయిన బీమా మొత్తం రూ.5 లక్షల గురించి ఆమెకు ఆలేఖ ద్వారా తెలియ చేసినట్లు కూడా ఆయన చెప్పారు. అలాగే ఆ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని లోకేష్ భరోసా ఇచ్చారని వివరించారు. అది తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు, వారి కుటుంబం పట్ల ఉండే అభిమానం, అంకితభావం, బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. రవి కుమార్ సతీమణి వనిత మాట్లాడుతూ కార్యకర్తలకూ బీమా సదుపాయం ఉంటుందని తెలిసి ఎంతో ఆశ్చర్యం, సంతోషం కలిగిందని, తన భర్త అకాల మరణంతో బాధలో ఉన్న తమ కుటుంబానికి ఈ బీమా మొత్తం కొంతవరకు భరోసా కల్పించిందని, అది కాకుండా స్వయంగా రాష్ట్ర మంత్రి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తమకు లేఖ ద్వారా సంతాపం తెలియచేసి అన్ని వేళలా అండగా ఉంటానని భరోసా ఇవ్వడం ఎంతో ఆత్మ స్థైర్యం కలిగిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నాయకులు మరుకుర్తి రవి యాదవ్, హరి బెనర్జీ, సాల్మన్ రాజు, శ్యామ్, దుత్తరపు గంగాధర్, నేమాలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే మావుళ్ళమ్మ కు స్వర్ణ వస్త్రాన్ని పూర్తి చేస్తాం

### 200 గ్రాముల బంగారం ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందజేత

**భీమవరం ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భీమవరం శ్రీమావుళ్ళమ్మ అమ్మవారికి స్వర్ణ వస్త్రాన్ని పూర్తి చేస్తామని, స్వర్ణ వస్త్రానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్నారని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మంగళవారం పట్టణానికి చెందిన ఇన్నమూరి యోగ శివాన్స్, వేదన్ష్, పి హర్షిల్ 200 గ్రాముల బంగారాన్ని ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా స్వర్ణ వస్త్ర నిధి సేకరణ సంఘంకు అందించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ అమ్మవారి స్వర్ణ వస్త్రానికి దాతలందిస్తున్న సహకారం అద్వితీయమని, త్వరలోనే అమ్మవారికి స్వర్ణ వస్త్రాన్ని కూడా పూర్తి చేస్తామని అన్నారు. అనంతరం దాతలను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్, కారుమూరి సత్యనారాయణ మూర్తి, ఐ కృష్ణారావు దంపతులు, స్వర్ణ వస్త్ర నిధి సేకరణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల

# జీవన పరిస్థితులు మెరుగుపరుస్తాం..

### నిర్వాసితులకు అంత్యోదయ అన్న యోజన కార్డులను అందజేసిన రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్

**ఏలూరు, ఏప్రిల్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రాజెక్టు నిర్వాసితులకు మెరుగైన జీవన పరిస్థితులు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ చెప్పారు. మంగళవారం బుట్టాయిగూడెం మండలం రెడ్డి గణపవరం లోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు అంత్యోదయ అన్న యోజన కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలోని నిర్వాసితుల సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ బహుళార్ధసాధక సాగునీటి ప్రాజెక్ట్ అయిన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి తమ భూములు త్యాగంచేసిన 35 వేల మంది నిర్వాసితుల త్యాగాలను తమ ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదని, వారిని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల పోలవరం పర్యటన సందర్భంగా నిర్వాసితుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, వాటిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. నిర్వాసితులకు ఆహార భద్రతాకీ అంత్యోదయ అన్నా యోజన కార్డులు అందజేసి వారికి ప్రతినెలా 35 కేజీల బియ్యన్ని ఉచితంగా అందిస్తున్నామన్నారు. నిర్వాసితుల కుటుంబాలలోని యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ఇందుకోసం ప్రత్యేక సర్వేని నిర్వహిస్తామన్నారు. పునరావాస కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యా, వైద్యం తదితర మౌలిక సదుపాయాలను ఆరు నెలలులోగా కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కాలనీలలో ఎట్టిపరిస్థితులలోను త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పోలవరం నియోజకవర్గంలో రోడ్డు అభివృద్ధికి గత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 27 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 20 కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని మంత్రి చెప్పారు. నిర్వాసితులకు నిబంధనల మేరకు పరిహారాన్ని పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. రాష్ట్రంలో 4.64 కోట్ల రైస్ కార్డు హోల్డర్లకు ప్రతినెల బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీని త్వరలో చేపడతామని మంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా సమాన ప్రాధాన్యతనిస్తున్నదని, రాష్ట్రంలోని 63 లక్షల మందికి ప్రతినెల 2 వేల 700 కోట్ల రూపాయలను పెన్షన్లుగా అందిస్తున్నామన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుండి 9 వేల 600 రూపాయలతో తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో పథకం వర్తింప చేస్తామన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమీషనర్ సౌరబ్ గౌర్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు అంత్యోదయ అన్నా యోజన కార్డులు అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించిన వెంటనే పునరావాస కాలనీలో మొదటివిడతలో సర్వే చేసి కార్డులు అందిస్తున్నామని, ఇంకా అర్హులైవరైనా ఉంటే వారికి కూడా అందిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ ముంపు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి అంత్యోదయ అన్నా యోజన అర్హులని గుర్తించడం జరిగిందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసిత కుటుంబాలకు ప్యాకేజి తో పాటు ఆయా కుటుంబాలు జీవన ప్రమాణాల స్థాయిని పెంచేందుకు వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నమన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ పేదల, రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. ఎన్నడూలేని విధంగా రైతుల నుండి సేకరించిన ధాన్యానికి 6 నుండి 24 గంటలలోగా వారి ఖాతాలకు కూటమి ప్రభుత్వం సొమ్ము జమచేసిందన్నారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన యువతకు, పెళ్ళైనవారికి కూడా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి అందించాలన్న నిర్వాసితుల విజ్ఞప్తిని పరిలిస్తామని మంత్రివర్యులు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, ఐటిడిఏ పివో రాములు నాయక్, ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఆర్ టిసి జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఆర్డిఓ ఎం.వి. రమణ, తహశీల్దారు అచ్యుత్, జనసేన నాయకులు కొటికలపూడి గోవిందరాజు, కరాటం సాయి, గడ్డమనుగు రవి, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.







తెలుగురాష్ట్రం దినపత్రిక

SPORTS NEWS

https://epaper.teluguraastram.com

అమలాపురం
ఏప్రిల్ 23,
బుధవారం 2025



# కోల్‌కతా.. చేసిన తప్పులే మళ్లీ చేస్తోంది : ఇయాన్ మోర్గాన్

డిపెండింగ్ ఛాంపియన్స్‌గా ఐపీఎల్ 2025 సీజన్‌లో అడుగుపెట్టిన కోల్‌కతా నైట్ రైడర్స్ ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. ముఖ్యంగా బ్యాటింగ్ వైఫల్యాలతో పరాజయాలను మూటగట్టుకుంటోంది. సోమవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 39 పరుగుల తేడాతో ఓడిపోయింది. కోల్‌కతాకు వరుసగా ఇది రెండో ఓటమి. ఆఖరి అయిదు మ్యాచుల్లో మూడో పరాజయం. ఓవరాల్‌గా ఇప్పటివరకు ఆడిన ఎనిమిది మ్యాచుల్లో అయిదో పరాజయం. మూడుసార్లు ఐపీఎల్ ఛాంపియన్స్‌గా నిలిచిన కోల్‌కతా తమ హెూం గ్రౌండైన ఈడెన్ గార్డెన్స్‌లో తలపడిన మ్యాచుల్లోనూ తడబడుతోంది. ఇక్కడ ఇప్పటివరకు నాలుగు మ్యాచులు జరిగితే అందులో మూడింట్లో ఓటమి పాలైంది.



తమ బౌలింగ్ విభాగం బాగున్నప్పటికీ, బ్యాటింగ్‌లో వైఫల్యాల వల్లే తాము ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నామని కెప్టెన్ అజింక్య రహానే అంగీకరించారు. ఈ విషయమై కోల్‌కతా నైట్‌రైడర్స్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ స్పందించాడు. 'మనం కోరుకుంటున్నట్లుగా కోల్‌కతా ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని బౌన్స్ బ్యాక్ కావడం లేదు. చేసిన తప్పులనే మళ్లీ మళ్లీ చేస్తోంది. వారు తమ బ్యాటింగ్ లైనప్‌లో కొన్ని మార్పులు చేశారు. కానీ అవి వర్కౌట్ కాలేదు' అని మోర్గాన్ అన్నాడు. రహానే చేసిన వ్యాఖ్యల మీద కూడా ఈ మాజీ తన అభిప్రాయం వ్యక్తంచేశాడు. 'గుజరాత్ టైటాన్స్ చేసిన 199 పరుగుల లక్ష్యాన్ని మేం ఛేదించగలం అనుకున్నామని అజింక్య రహానే చేసిన వ్యాఖ్యలు నన్ను కాస్త ఆశ్చర్యానికి గురిచేశాయి. ఎందుకంటే... ఈ పిచ్‌పై బాల్ అనుకున్నదానికంటే కాస్త ఎక్కువ ఎత్తులో వచ్చింది. ఈ కారణంగానే బౌండరీలు కొట్టడం బ్యాటర్లకు కష్టంగా మారింది. అలాగే కోల్‌కతా నైట్ రైడర్స్ ఇన్నింగ్స్‌లో భాగస్వామ్యాలు లేవు. ప్రసిద్ధ్ కృష్ణ మాత్రం చక్కగా బౌలింగ్ చేసి కీలక సమయంలో రెండు వికెట్లు తీసుకున్నాడు' అని ఇయాన్ మోర్గాన్ విశ్లేషించాడు.

### 'అతనో క్లాసికల్ బ్యాటర్'

టీమ్ఇండియా మాజీ బ్యాటర్ అంబటి రాయుడు ఈ మ్యాచ్‌లో 36 బంతుల్లో 52 పరుగులు చేసిన సాయి సుదర్శన్(%ఖుఐ ాబసష్ఘుతీయిఖఅ%)ను ప్రశంసించాడు. 'సాయి సుదర్శన్ బ్యాటింగ్ చూస్తుంటే చూడముచ్చటగా ఉంది. క్లాసికల్ బ్యాటర్‌లా క్రీజులో కదులుతూ సంప్రదాయక రీతిలో పరుగులు రాబట్టాడు. బంతి పేస్‌ను వాడుకొని, స్మార్ట్ క్రికెట్ ఆడాడు. తెలివిగా ఆడుతూ... పరుగులు రాబడితే మనలో ఆత్మవిశ్వాసమూ పెరుగుతుంది' అని అంబటిరాయుడు అన్నాడు.

# మా బౌలింగ్ బాగుంది... బ్యాటింగే మెరుగుపడాలి

## అజింక్య రహానే

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా సోమవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్ 39 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ ముందు 199 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఛేదనలో కేకేఆర్ 8 వికెట్లు నష్టపోయి 159 పరుగులకే చేతులెత్తేసింది. ఈనేపథ్యంలో మ్యాచ్ అనంతరం కోల్‌కతా కెప్టెన్ అజింక్య రహానే (%ూాయిఅఅనెఖ =ఖ్రష్ఘుఅవ%) మాట్లాడుతూ వాస్తవానికి ఇది తాము గెలవాల్సిన మ్యాచ్ అన్నారు.



'నిజానికి 199 పరుగుల లక్ష్యాన్ని మేం ఛేదిస్తాం అనుకున్నాం. మా బౌలింగ్ విభాగం బాగానే పని చేసింది. మా జట్టు ఓపెనింగ్ సరిగా లేదు. ఈ టోర్నమెంటంతా ఇలాగే ఇబ్బంది పడుతున్నాం. మేం మా తప్పుల నుంచి సాధ్యమైనంత తొందరగా నేర్చుకోవాల్సి ఉంది. అలాగే.. ఈ పిచ్ కాస్త నెమ్మదిగా ఉంది. మేం ఎప్పుడైతే బౌలింగ్‌కు దిగామో అప్పుడు ప్రత్యర్థి జట్టును 200 లేదా 210లోపు కట్టడి చేయాలనుకున్నాం. మేం మరింత మెరుగ్గా బ్యాటింగ్ చేసి ఉంటే బాగుండేది. ముఖ్యంగా మిడిల్ ఓవర్లలో మేం తేలిపోయాం. చక్కటి ఓపెనింగ్ భాగస్వామ్యాలు కూడా నమోదు చేయలేకపోతున్నాం. మా బౌలర్ల గురించి నాకు ఏ చింతా లేదు. ప్రతి మ్యాచ్‌కూ వారు రాటుదేలుతున్నారు. ఫీల్డింగ్‌లోనూ మరింత మెరుగ్గా ఉంటే.. కనీసం 15 నుంచి 20 పరుగులు ఆపి ఉండేవాళ్లం. కానీ మా సభ్యులు ఫీల్డింగ్‌పై చక్కగానే దృష్టిపెడుతున్నారు' అని రహానే తమ జట్టు బ్యాటింగ్ వైఫల్యాల గురించి కుండ బద్దలు కొట్టారు. 'మేం ఈ మ్యాచ్‌లో ఆధిపత్యం చెలాయించాం. కానీ గెలవడమే ముఖ్యం. మంచి టీమ్‌లకు ఈ విషయం చక్కగా తెలుస్తుంది. ఈ పొట్టి ఫార్మాట్‌లో చక్కటి ప్రదర్శన చేయడం సవాళ్లతో కూడుకున్నదే. మేం కొన్ని పరుగులు ఎక్కువ చేశాం కాబట్టి విజయం సాధించాం. ఈవిషయంలో మేం మావంతు పాత్ర చక్కగా పోషించాం' అని గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్‌గిల్ అన్నాడు.

# హెయిర్ డ్రైయర్స్ కాదు.. ఆ కెప్టెన్‌కు గోల్డ్ కోటెడ్ ఐఫోన్ 16 ప్రో !

పాకిస్థాన్ సూపర్ లీగ్- 2025లో లాహెూర్ కలేండర్స్ తమ కెప్టెన్ షహీన్ అఫ్రిదికి ఐఫోన్ అందించింది. ఇది బంగారు కోటెడ్ ఐఫోన్ 16 ప్రో కావడం విశేషం. కరాచీ కింగ్స్ తమ ఆటగాళ్లకు హెయిర్ డ్రైయర్లు, ట్రిమ్మర్లు అందజేయడంతో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే లాహెూర్ తమ జట్టు సారథికి ఈ ప్రత్యేక బహుమతి అందించింది. ఈస్టర్ సందర్భంగా లాహెూర్ ప్లేయర్స్‌తో పాటు సహాయక బృందానికి కొన్ని బహుమతులు అందించింది. 24 క్యారెట్ బంగారు కోటెడ్ తొలి ఐఫోన్‌ను కెప్టెన్ షహీన్ అఫ్రిది అందుకున్నాడు. "మా కెప్టెన్ విలువైన బహుమతి అందుకున్నాడు. దీన్ని ప్రత్యేకంగా అతడి కోసమే తయారు చేయించాం" అని లాహెూర్ 'ఎక్స్' వేదికగా పంచుకుంది. అయితే.. షహీన్‌కు మాత్రమే ఈ ఐఫోన్ అందించడం అన్యాయమంటూ అదే జట్టులోని మరో ఆటగాడు హారీస్ రవూఫ్ వ్యాఖ్యానించాడు.



పాకిస్థాన్ సూపర్ లీగ్- 2025లో లాహెూర్ మూడు మ్యాచ్‌లు ఆడగా.. రెండు సార్లు విజయం సాధించింది. పీఎస్ఎల్- 2025లో రెండో స్థానంలో నిలిచింది. అయితే.. అంతకుముందు డ్రెస్సింగ్ రూమ్‌లో కరాచీ కింగ్స్ ఇంగ్లాండ్ క్రికెటర్ జేమ్స్ విన్స్‌కి హెయిర్ డ్రయ్యర్‌ను బహుమతిగా అందించింది. ఏప్రిల్ 16న లాహెూర్‌తో జరిగిన మ్యాచ్ అనంతరం పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ హసన్ అలీ జట్టుకు ట్రిమ్మర్లు అందించింది. దీంతో విమర్శలు వెల్లువెత్తాయి.

# సిమ్రన్‌ప్రీత్‌కు రజతం

లిమా (పెరూ): ప్రపంచకప్ షుటింగ్ స్టేజ్-2 టోర్నమెంట్లో భారత్‌కు మరో పతకం దక్కింది. సోమవారం మహిళల 25 మీటర్ల పిస్టల్‌లో సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ రజతంతో మెరిసింది. ఫైనల్లో ఆమె 33 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. సన్ యుజీ (చైనా, 34) ఒక్క పాయింట్ తేడాతో స్వర్ణాన్ని గెలుచుకుంది. మరో చైనా షుటర్ యావో కియాన్‌గ్జున్ (29) కాంస్యం దక్కించుకుంది. స్టార్ షుటర్ మను బాకర్‌కు నిరాశ ఎదురైంది. క్వాలిఫయింగ్‌లో రెండో స్థానంలో నిలిచిన మను (585).. ఫైనల్లో 22 పాయింట్లే స్కోరు చేసి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ఇషా సింగ్ (575) క్వాలిఫయింగ్‌లో వెనుదిరిగింది.



# ఆ మ్యాచ్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు... ఖండించిన రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం



లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఫిక్సింగ్ జరిగిందని రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ తాత్కాలిక అడ్‌హక్ కమిటీ కన్వీనర్ జయదీప్ బిహానీ తీవ్రమైన ఆరోపణలు చేశాడు. ఈ వ్యాఖ్యలు నిరాధారమైనవని రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం ఖండించింది.

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ఏప్రిల్ 19వ తేదీన లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో రాజస్థాన్ రాయల్స్ 2 పరుగుల తేడాతో ఓడిపోయింది. దీనిపై రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ తాత్కాలిక అడ్‌హక్ కమిటీ కన్వీనర్ జయదీప్ బిహానీ సందేహాలు లేవనెత్తాడు. ఈ మ్యాచ్ ఫిక్స్ అయ్యిందని తీవ్రమైన ఆరోపణలు చేశాడు. ఈ వ్యాఖ్యలను రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం ఖండించింది. బిహానీపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, క్రీడా మంత్రి, క్రీడా కార్యదర్శికి అధికారికంగా ఫిర్యాదు చేసింది. అలాగే... రాజస్థాన్ రాయల్స్ టీమ్‌కు చెందిన సీనియర్ అధికారి దీప్ రాయ్.. ఈ వ్యాఖ్యలను తోసి పుచ్చారు. 'బిహానీ చేసినవి తప్పుడు ఆరోపణలు. అవి నిరాధారమైనవి' అని ఖండించారు. మరో వైపు జయదీప్ బిహానీ జట్టు ప్రదర్శనపై అనుమానం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. రాజస్థాన్ రాయల్స్, రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్, భారత క్రికెట్ నియంత్రణ మండలి.. రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ తాత్కాలిక కమిటీని ఐపీఎల్ సంబంధిత కార్యకలాపాల నుంచి పక్కన పెట్టడానికి కుట్ర పన్నాయని ఆరోపించారు. అయితే ఈ వాదనలపై రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం తీవ్ర అభ్యంతరం తెలిపింది. "బిహానీ చేసిన అన్ని ఆరోపణలను మేం ఖండిస్తున్నాం. ఇటువంటి బహిరంగ ప్రకటనలు తప్పుదారి పట్టించడమే కాకుండా రాజస్థాన్ రాయల్స్, రాయల్ మల్టీ స్పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్, బీసీసీఐ ఖ్యాతి, విశ్వసనీయతకు తీవ్ర నష్టం కలిగించాయి. అవి క్రికెట్ సమగ్రతను కూడా దెబ్బతీశాయి' అని ఆగ్రహం వ్యక్తం చేసింది.

'బీసీసీఐ ప్రస్తుత ఏర్పాట్ల ప్రకారం, ఈ సీజన్ కోసం జైపుర్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించే అధికారిక హక్కులను రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్ కలిగి ఉంది. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకత్వంలో కౌన్సిల్, బీసీసీఐతో సమన్వయంతో పనిచేస్తున్నాం' అని రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా... ఓ సందర్భంలో బిహానీ మాట్లాడుతూ.. 'గతంలో రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్రంలో అంతర్జాతీయ మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించింది. కానీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ తాత్కాలిక అడ్‌హక్ కమిటీని జైపుర్‌లో జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లకు దూరంగా ఉంచుతున్నారు. రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్ క్రీడా ప్రయోజనాలకు వ్యతిరేకంగా కుట్ర చేస్తోంది. వారు ఈవెంట్‌కు సంబంధించిన సభ్యులకు కనీసం అక్రిడిటేషన్ కార్డులను కూడా తయారు చేయలేదు' అని ఆరోపించారు.

# పాయింట్ల పట్టికలో టాపర్ గుజరాత్..

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా సోమవారం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 39 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో 12 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. మరో నాలుగు పాయింట్లు సాధిస్తే చాలు ప్లేఆఫ్స్‌కు చేరుకుంటుంది. గుజరాత్ టైటాన్స్ ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచుల్లో 6 విజయాలు సాధించింది. 2 మ్యాచుల్లో ఓటమి పాలైంది.

### ఏ 'గిల్' మాంగే మోర్!

కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 55 బంతుల్లో 90 పరుగులు చేసి కేకేఆర్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో 300 పరుగుల మార్క్‌ను దాటిన ఏడో బ్యాటర్‌గా నిలిచాడు. కెప్టెన్‌గానూ టీమ్‌ను నడిపించడంలో తన మార్క్ చూపిస్తున్నాడు.

### సూపర్ సాయిసుదర్శన్!

సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్ సాయిసుదర్శన్ ఈ సీజన్‌లో అందరికంటే ముందు 400 పరుగుల మార్క్‌ను దాటాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తాను చేసిన 52 పరుగులతో ప్రస్తుతం ఓవరాల్‌గా 417 రన్స్‌తో టాప్ బ్యాటర్‌గా నిలిచాడు. ఆరెంజ్ క్యాప్‌నూ సొంతం చేసుకున్నాడు.

### వారేవ్వా.. ప్రసిద్ధ్ కృష్ణ!

బ్యాటింగ్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున సాయిసుదర్శన్ బ్యాటింగ్‌లో వీరవిహారం చేస్తుంటే... బంతితో ప్రసిద్ధ్ కృష్ణ తన ప్రతిభ చాటుతున్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచులో 2 వికెట్లు తీసుకున్నాడు. మొత్తంగా 8 మ్యాచుల్లో 16 వికెట్లు నేలకూల్చి బౌలర్ల జాబితాలో టాప్ ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. పర్పుల్ క్యాప్ హెూల్డర్‌గా నిలిచాడు. గుజరాత్ టైటాన్స్ జట్టు పాయింట్ల పట్టికలో 12 పాయింట్లతో మొదటిస్థానంలో కొనసాగుతోంది. ఇదే టీమ్‌కు చెందిన బ్యాటర్ సాయిసుదర్శన్ 417 పరుగులతో ఆరెంజ్ క్యాప్‌ను, బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ 16 వికెట్లు గిరాటేసి పర్పుల్ క్యాప్‌ను సాధించాడు. ఈ గణాంకాలు చూస్తేనే తెలుస్తోంది ఐపీఎల్ 2025 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ ఎలా సత్తా చాటుతుందోనని!

# మా నాలుగో పెళ్లిరోజునే పాప పుట్టింది : విష్ణువిశాల్ గుత్తా జ్వాల



సినీనటుడు విష్ణు విశాల్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాలకు పండంటి ఆడపిల్ల పుట్టింది. ఈ శుభవార్తను ఆ జంట ఎక్స్ వేదికగా తెలిపారు. " మాకు ఆడపిల్ల పుట్టింది. ఆర్యన్ ఇప్పుడు అన్నయ్య అయ్యాడు. మా నాలుగో పెళ్లి రోజు నాడు పాప పుట్టడం మరింత ఆనందంగా ఉంది. మాకు దేవుడు ఇచ్చిన బహుమతిగా భావిస్తున్నాం. మీ అందరి ప్రేమ, ఆశీర్వాదం కావాలి " అని తెలుపుతూ ఎక్స్‌లో ఓ ఫొటో పంచుకున్నారు. దీంతో ఈ జంటకు ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 2021 ఏప్రిల్ 22న వీరిద్దరూ వివాహబంధంలోకి అడుగుపెట్టారు. ఇప్పుడు నాలుగేళ్ల తర్వాత ఇదే రోజు పాప పుట్టడం ఎంతో స్పెషల్ అంటూ నెటిజన్‌లు కామెంట్స్ పెడుతున్నారు.

## కుబేర' విడుదలకు సిద్ధం



ఈ వేసవిలో రాబోతున్న భారీ బడ్జెట్ సినిమాల్లో 'కుబేర' కూడా ఒకటి. దర్శకుడు శేఖర్ కమ్ముల సినిమాల్లో అత్యధిక బడ్జెట్ సినిమా ఇదే. నాగార్జున, ధనుష్ ప్రధాన పాత్రల్లో నటించారు. రష్మిక కథానాయిక. దేవీశ్రీప్రసాద్ సంగీతాన్ని అందించారు. బ్యాంకాక్, ముంబై పరిసర ప్రాంతాల్లో ఈ సినిమా షఉటింగ్ జరిగింది. తెలుగు, తమిళంలో ఏకకాలంలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. షఉటింగ్ పూర్తయ్యింది. ఎడిటింగ్, నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ వేసవిలోనే ఈ సినిమా థియేటర్లలో సందడి చేయనుంది.

## 3000 మంది ఆర్టిస్టులతో..




కథానాయకుడు మహేష్‌బాబు, దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హాలీవుడ్ మూవీ 'ఎస్ఎస్ఎంబి 29'. ఫిబ్రవరి రెండోతేదీన ఈ సినిమా షఉటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఆ తర్వాత ఒరిస్సాలో మొదటి షెడ్యూల్ పూర్తయ్యింది. కాశీని తలపించే సెట్స్‌లో చిత్రీకరణ జరగ్గా..ప్రియాంకాచోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ నటించారు. వీటికి సంబంధించిన ఫొటోలు ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా రెండో షెడ్యూల్ ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లో జరగబోయే రెండో షెడ్యూల్‌లో మహేష్, ప్రియాంకాచోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్‌లతోపాటుగా 3000 మంది జూనియర్ ఆర్టిస్టులతో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించబోతున్నారు. ప్రముఖ హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ల నేతృత్వంలో ఈ సీక్వెన్‌ను తెరకెక్కించబోతున్నారు. ఈనెలాఖరులో రిహార్సల్స్ పూర్తిచేసి ఆ తర్వాత షఉటింగ్ పూర్తిచేస్తారు. 'వన్ నేనొక్కడినే' మూవీలో ఉన్నట్లుగా ఈ సినిమాలో కూడా బోట్ ఛేజింగ్ సీన్ కూడా ఉంటుందని సమాచారం. దీనికి సంబంధించిన ఏర్పాట్లలో టెక్నీషియన్లు నిమగ్నమై ఉన్నారు. ఇప్పటికే పలు హాలీవుడ్ ఏజెన్సీలతో ఒప్పందాలు కూడా చేసుకోవటంతో ఆయా సంస్థలకు చెందిన టెక్నీషియన్లు ఈ మూవీ కోసం ఇప్పటికే పని ప్రారంభించారు. సముద్రంలో జరిగే ఫైట్ సీక్వెన్స్ ఈ సినిమాకు హైలెట్‌గా నిలుస్తుందని, దీనికి సంబంధించిన వీఎఫ్ఎక్స్ కూడా అదిరిపోయేలా ఉంటాయనే చర్చ ఇండస్ట్రీలో బాగా జరుగుతోంది.

# మోహన్‌లాల్ 'తుడరుమ్' తెలుగు ట్రైలర్ విడుదల

### మలయాళ మెగాస్టార్ మోహన్‌లాల్, తరుణ్ మూర్తి కాంబోలో 'తుడరుమ్'




మలయాళ సినీ రంగంలో తనదైన ముద్ర వేసుకున్న మెగాస్టార్ మోహన్‌లాల్, నూతన ప్రతిభ కలిగిన దర్శకుడు తరుణ్ మూర్తి దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'తుడరుమ్' ప్రస్తుతం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేపుతోంది. మలయాళంతో పాటు తెలుగులోనూ ఏప్రిల్ 25న ఈ చిత్రం భారీగా విడుదలకానుంది. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని మేకర్స్ ఇటీవలే తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్ క్రైమ్ కామెడీ జోనర్‌కు చెరిన మంచి మిక్స్‌ను చూపించడంతో ప్రేక్షకులు భారీగా స్పందిస్తున్నారు. మోహన్‌లాల్ అభిమానులు మాత్రమే కాకుండా, జనసామాన్య ప్రేక్షకులలోనూ ఈ చిత్రంపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమాలో మోహన్‌లాల్ పూర్తిగా కొత్త గెటప్‌లో కనిపించనున్నారు. ఇందులో ఆయన ఒక సాధారణ టాక్సీ డ్రైవర్ పాత్రలో కనిపిస్తారు. తన జీవనాన్ని నడిపించుకునే సమయంలో ఎదురయ్యే విచిత్రమైన, వినోదాత్మకమైన సంఘటనలు కథని ఆసక్తికరంగా మలుస్తాయి. మోహన్‌లాల్ నటనలో సహజత్వం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇక టాక్సీ డ్రైవర్ పాత్రలో ఆయన చూపించిన వైవిధ్యం ఈ సినిమాకే ప్రత్యేక ఆకర్షణ కానుంది. ఇప్పటి వరకు గంభీరమైన పాత్రలతో అలరించిన మోహన్‌లాల్, ఈసారి కాస్త హాస్యంతో కూడిన పాత్రను అద్భుతంగా పోషించబోతున్నారు.

**మళ్లీ జతకట్టిన మోహన్‌లాల్ %-% శోభన జోడీ**

ఈ చిత్రంలో సీనియర్ నటి శోభన కథానాయికగా నటిస్తున్నారు. మోహన్‌లాల్ %-% శోభన జంట మలయాళ సినీ పరిశ్రమలో ఒక స్వర్ణయుగాన్ని తలపించే జంటగా నిలిచారు. ఇప్పటివరకు ఈ ఇద్దరూ కలిసి 55 సినిమాల్లో నటించారు. 'తుడరుమ్'తో ఇప్పుడు 56వసారి తెరపై కనువిందు చేయబోతున్నారు. వీరి మధ్య వచ్చే కెమిస్ట్రీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఎన్నో విజయవంతమైన సినిమాలు ఇచ్చిన ఈ జంట మరోసారి ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమయ్యారు.

**రెజపుత్ర విజువల్ మీడియా సమర్పణలో ప్రత్యేక చిత్రం**

'తుడరుమ్' చిత్రాన్ని రెజపుత్ర విజువల్ మీడియా సమర్పణలో ఎమ్. రెంజిత్ నిర్మిస్తున్నారు. నిర్మాణ విలువల పరంగా కూడా ఈ సినిమా చాలా రిచ్‌గా ఉండబోతున్నట్లు ట్రైలర్ చూస్తే స్పష్టంగా తెలుస్తోంది. కథనం, నేపథ్య సంగీతం, సినిమాటోగ్రఫీ అన్నింటికీ మంచి ప్రాధాన్యం ఇచ్చారు. దర్శకుడు తరుణ్ మూర్తి తనదైన శైలిలో కథను మలిచినట్లు కనిపిస్తోంది. ప్రత్యేకంగా మలయాళ ప్రేక్షకులకు సరిపోయేలా ఉంటూనే, తెలుగు ప్రేక్షకుల అభిరుచులకు కూడా తగ్గట్టుగా కథను రూపుదిద్దారు. ప్రస్తుతం ఈ సినిమాపై మలయాళం, తెలుగు భాషల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా మోహన్‌లాల్ నటన, శోభన గ్లామర్‌తో పాటు, సినిమా నడిచే విధానం కూడా ప్రేక్షకులను థియేటర్లకు లాకట్టేలా ఉండనుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. క్రైమ్ కామెడీ నేపథ్యంలో నడిచే కథలు ఎప్పుడూ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయి. పైగా, మోహన్‌లాల్ లాంటి నటుడు అలాంటి పాత్రను చేయడం ద్వారా సినిమాకు మరింత బలమవుతుంది.

# బీచ్ బికినీ క్వీన్.. హొయలు చూసారా?

బికినీ బీచ్ సెలబ్రేషన్స్ తో నిరంతరం చిల్ చేస్తుంది నేహాశర్మ. ఈ బ్యూటీ సినిమాలతో కంటే, షికార్లతోనే ఎక్కువగా కాలక్షేపం చేస్తోంది. కెరీర్ పరంగా ఆశించిన పరిణతి లేకపోయినా కానీ, నిరంతరం సోషల్ మీడియాల్లో విజువల్ ట్రీట్ తో అలరిస్తోంది. నేహాశర్మ వరుస ఫోటోషఉట్లు , వీడియో షఉట్లు ఫ్యాన్స్ కి కావాల్సినంత వినోదం పంచుతున్నాయి. తాజాగా మరోసారి బికినీలో చెలరేగిపోయింది. ఈ ఆదివారం సూర్యుని ఎండలో ఇలా గడిపాను! అంటూ చాలా ఫోజులు కొట్టింది. ఒంటరి ద్వీపంలో శర్మా గాళ్ బికినీ ఫోజులు ప్రస్తుతం యూత్ లో వైరల్ గా మారాయి. నేహా శర్మ మాల్దీవుల నుండి తన అద్భుతమైన వెకేషన్ ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయగా హీట్‌ను పెంచుతోంది. ఎంపిక చేసిన పాస్టెల్ బికినీపై లైమ్-గ్రీన్ కో-ఆర్డ్ సెట్ అద్భుతంగా కనిపిస్తోంది. అలా ఎండలో నడుస్తూ, తాటి చెట్టు కింద పోజులిచ్చినా .. బీచ్ ఇసుక లో చెప్పులు లేకుండా నడిచినా, బికినీలో గ్లామర్‌ను చిందింది. ఎండలో ప్రశాంతమైన ఆదివారాన్ని నచ్చినట్టు ఆనందించడంలోనే కాదు... వీక్షకులను సంతుష్టులను చేయడంలోను ఎక్కడా తగ్గడం లేదు. కెరీర్ మ్యాటర్ కి వస్తే... క్రూక్, క్యా సూపర్ కూల్ హై హమ్, తుమ్ బిన్ 2 లాంటి చిత్రాల్లో తనదైన నటనతో ఆకట్టుకుంది. బాలీవుడ్‌లోకి నటిగా అడుగుపెట్టే ముందు మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది. ఇటీవల నేహా కొన్ని సినిమాల్లో నటించినా అవేవీ విజయం సాధించలేదు. దీంతో రేసులో వెనకబడింది. హేరాఫేరి 3 కాస్టింగ్ లో చేరినా ఈ సినిమా రిలీజ్ అంతకంతకు ఆలస్యమైన సంగతి తెలిసిందే.





# మూవీ నెగిటివ్ రివ్యూలపై స్పందించిన నాని



సినిమా రివ్యూలపై ఇండస్ట్రీలో ఎప్పుడూ చర్చలు జరుగుతూనే ఉంటాయి. సమీక్షలు పాజిటివ్ గా ఉంటే ఇబ్బందేమీ లేదు కానీ, ఒకవేళ నెగెటివ్ గా ఉంటే మాత్రం డిస్కషన్స్ మొదలవుతాయి. ఇప్పుడు టాలీవుడ్ లో అలాంటి చర్చే జరుగుతోంది. రిలీజైన రోజున ఇచ్చే వీడియో రివ్యూల ప్రభావం సినిమా ఓపెనింగ్స్ పై పడుతోందని సినీ పెద్దలు భావిస్తున్నారు. విడుదల రోజు సమీక్షలు ఇవ్వకుండా ఆపాలనే ప్రయ్నత్నాలు, సమాలోచనలు సాగుతున్నాయని తెలుస్తోంది.ఏదైనా కొత్త సినిమా రిలీజ్ అవుతుందంటే.. మొదటి ఆట పడగానే మీడియాలో, సోషల్ మీడియాలో రివ్యూలు రావడం మనం చూస్తున్నాం. అయితే ఇకపై సినిమా విడుదలైన రోజున ఇచ్చే వీడియో రివ్యూలను అడ్డుకోవాలని యోచిస్తున్నారు. ఫస్ట్ డే రివ్యూలు ఇవ్వకుండా, థియేటర్లలోకి వచ్చిన 2 రోజులు తర్వాత సమీక్షించాలే నిర్ణయంపై ఫిలిం ఛాంబర్లో చర్చ జరుగుతున్నట్లు సమాచారం అందుతోంది. దానికి అంగీకరించకపోతే తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి అన్ని విధాలా నిషేధాలు విధించాలనే నిర్ణయం తీసుకోవాలని గిల్డ్ సభ్యులపై కొందరు పెద్దలు ఒత్తిడి చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. సోషల్ మీడియా లేని రోజుల్లోనే సినిమాలకు సమీక్షలు ఇవ్వడం మొదలైంది. ఒకప్పుడు సినిమా రిలీజైన తర్వాత వార్తా పత్రికల్లో, మంత్లీ మ్యాగజైన్స్ లో రివ్యూలు రాసేవారు. రాను రాను విడుదలైన మరుసటి రోజు న్యూస్ పేపర్స్ లో రివ్యూలు రాయడం ప్రారంభించారు. ఇబ్బడిముబ్బడిగా టీవీ ఛానల్స్ వచ్చిన తర్వాత, రివ్యూలకు వీడియో రూపం వచ్చింది. మొదట్లో సినిమా విడుదలైన రోజు రాత్రి ప్లస్సులు, మైనస్సుల గురించి చెప్పేవారు. కానీ ఇప్పుడు డిజిటల్ యుగంలో సినిమా థియేటర్లలోకి వచ్చిన వెంటనే సమీక్షలు ఇచ్చేస్తున్నారు. అయితే ఇక్కడ సద్విమర్శతో సమస్యేమీ లేదు కానీ పనిగట్టుకొని వాంటెడ్ గా నెగెటివిటీని ప్రచారం చేస్తున్న రివ్యూలపైనే అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. నాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం హిట్ 3. బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ హిట్ నుంచి వస్తున్న 3వ చిత్రమిది. ఈ చిత్రంలో నాని కథానాయకుడిగా నటించడంతో పాటు నిర్మాణ బాధ్యతలు చేపట్టాడు. శైలేశ్ కొలను దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా మే 01న ఈ చిత్రం ప్రేకకుల ముందుకు రానుంది. ఈ క్రమంలోనే మేకర్స్ ప్రమోషన్స్‌లో షురూ చేశారు. ఇందులో భాగంగానే వరుసగా ఇంటర్వ్యూలలో పాల్గొంటున్నాడు నాని. తాజాగా ఒక ఇంటర్వ్యూలో నానిని సినిమా విడుదల కాగానే రివ్యూలు ఎందుకు అని ఈ మధ్య అంటున్నారు. దీనిపై మీ స్పందన ఏంటి అని అడుగగా నాని మాట్లాడుతూ సినిమాలకు రివ్యూలు ఇచ్చేవారు ఒకరోజు ఆగమని చిత్రయూనిట్‌లు చెబుతున్నాయి. వాళ్లు ఎందుకు ఆగుతారు. దీనిని ఒక్కరోజు లాగవచ్చు లేదా రెండు రోజులు లాగవచ్చు కానీ చెప్పాల్సింది మాత్రం ఆపరు. ఇంతకుముందు అంటే సోషల్ మీడియా లాంటివి లేవు. కానీ ఇప్పుడు ఏం చేసినా తెలుస్తుంది.అని చెప్పారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339